

మంత్రి నారా లోకేశ్‌కు సమస్యలు వివరిస్తున్న బాధితులు

అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.. ఆదుకోండి

ఉండవల్లి(తాడేపల్లి), న్యూస్‌టుడే : తమ కుటుంబానికి వారసత్వంగా వచ్చిన 5.48 ఎకరాల అసైన్డ్ భూమిని వైకాపా నేతలు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఓబుల్‌నాయుడు పాలేనికి చెందిన సిద్దెల కిరణ్ ఉండవల్లిలో గురువారం జరిగిన ప్రజాదర్బార్‌లో మంత్రి నారా లోకేశ్‌కి వినతిపత్రం అందజేశారు. ఆ భూమిని జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణానికి ఇచ్చి సొమ్ము చేసుకున్నారని మంత్రికి తెలిపారు. వైకాపా నేతలైన కేశం హరినాథ్, దుగ్గెంపూడి అంజిరెడ్డి, వీఆర్‌ఏ పొత్తూరు పద్మ, భాగ్యరాజు తనను నమ్మించి మోసం చేశారని కన్నీటి పర్యంతమయ్యారు. నిషేధిత జాబితా నుంచి తమ భూమిని తొలగిస్తామని చెప్పి తమ వద్ద రూ.3 లక్షల నగదు, 50 గ్రాముల బంగారాన్ని లంచంగా తీసుకున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించి న్యాయం చేయాలని కోరారు. రైతు సేవా కేంద్రాల్లో పని చేస్తున్న టీఏ, డీఈవో, హెల్పర్లకు కాంట్రాక్టు కాల పరిమితి 11 నెలలకు రెన్యూవల్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ఎన్టీఆర్ జిల్లాకు చెందిన సిబ్బంది విజ్ఞప్తి చేశారు. గత నెలలో వచ్చిన వరదల్లో తన ట్యాక్సీ మునిగి పూర్తిగా పాడైందని మరమ్మతులకు తన వద్ద నగదు లేదని ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని పామర్రు నియోజకవర్గం హనుమంతపురానికి చెందిన కొడాలి కరుణాకర్ బాబు కోరారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న తనకు పింఛను మంజూరు చేసి ఆదుకోవాలని మందడం గ్రామానికి చెందిన పిల్ల పాగ రోశమ్మ విన్నవించారు. డిగ్రీ వరకు చదివిన తన దివ్యాంగ కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని గుంటూరు శ్రీనగర్‌కు చెందిన బొంతల శ్రీనివాసరావు వినతిపత్రం అందజేశారు.

మిర్చి రుణాల గుట్టు విప్పేదెప్పుడు?



రెండు నెలలు దాటినా పూర్తి కాని విచారణ

ఈనాడు – అమరావతి

మిర్చి రుణాల బాగోతంపై విచారణ ఇంకా కొలిక్కి రాలేదు. బాధ్యులెవరో బయటపెట్టనూ లేదు. అక్రమాల వెనుక ఆనాటి వైకాపా నేతల ప్రమేయం, ఒత్తిడి ఉందన్న ఆరోపణల నేపథ్యంలో విచారణ ఇంకా కొలిక్కి రాకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విచారణాధికారులపై ఏమైనా ఒత్తిడి ఉందా? కావాలనే జాప్యం చేస్తున్నారా? అన్నది అంతుబట్టడం లేదు.

శీతల గోదాముల్లో నిల్వ చేసిన మిర్చికి రైతుల పేర్లతో బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న యజమానులు వాటిని తిరిగి చెల్లించని వైనం.. పైగా మిర్చిని అమ్మేసుకున్న ఉదంతాలు. ఒక శీతల గోదాములో పెట్టిన మిర్చికి రైతులకు తెలియకుండానే రెండు బ్యాంకుల్లోంచి రుణాలు పొందిన వ్యవహారాలు బయటకొచ్చిన సంగతి తెలిసిందే. ప్రధానంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు నల్లపాడు శాఖ కేంద్రంగా భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయి. శీతల గోదాముల్లో నిల్వ చేసిన మిర్చికి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు నుంచి రూ. 164 కోట్ల రుణాలు తీసుకోగా.. ఒక్క నల్లపాడు బ్రాంచి పరిధిలోనే రూ. 116 కోట్ల వరకు అప్పులిచ్చారు. ఈ నేపథ్యంలో జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక విచారణ జరిపారు. పోలీసులు సైతం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అంతర్గతంగా విచారణాధికారిని నియమించి విచారణ చేయిస్తోంది. అయితే తొలి ఘటన జులై 29న జరిగింది. ఇప్పటి దాకా విచారణ పూర్తికాకపోవడం గమనార్హం. ఒకే బ్యాంకు పరిధిలో రూ. 116 కోట్ల రుణాలు మంజూరు కావడం వెనుక వైకాపా నేతల ప్రమేయం ఉందన్న ఆరోపణలొచ్చాయి.

బాధ్యులపై చర్యలు తీసుకోరా?

జీడీసీసీబీ నుంచి తీసుకున్న రుణాల గడువు ముగిసినా ఇంకా చెల్లించాల్సిన బకాయిలు రూ. 25 కోట్ల వరకు ఉన్నాయి. అయినా బ్యాంకు ఉన్నతాధికారులు మేల్కొనకపోవడం గమనార్హం. అక్రమాలపై సీబీఐకి సైతం ఫిర్యాదులు వెళ్లాయి. నల్లపాడు శాఖలో అక్రమాలపై బ్యాంకు సీఈవో కృష్ణవేణిని వివరణ కోరగా విచారణ నివేదిక ఇంకా రాలేదన్నారు.

ఏం జరుగుతోంది..?

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు నల్లపాడు, గురజాల శాఖల పరిధిలో రుణాల మంజూరు వ్యవహారంపై విచారణకు ఒక సీనియర్ అధికారిని నియమించారు. బ్యాంకుకు సంబంధించి రూ. కోట్ల సొమ్ము ముడిపడి ఉండటం, మరోవైపు రైతుల పేర్లతో గోదాముల యజమానులే రుణాలు తీసుకున్నారని ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో యుద్ధప్రాతిపదికన విచారణ జరిపి, అసలు విషయం తేలిస్తే.. రుణాల రికవరీతోపాటు తప్పులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉండేది. ఇప్పటివరకు విచారణ పూర్తి చేసి నివేదిక ఇవ్వకపోవడంతో బ్యాంకు వైపు నుంచి ఎలాంటి చర్యలు మొదలుకాలేదు.

☛ మరోవైపు నల్లపాడు బ్రాంచి పరిధిలోని అక్రమాలపై సహకార శాఖ ముగ్గురు అధికారులతో విచారణ చేపట్టింది. ప్రాథమికంగా దర్యాప్తు చేసి కొన్ని తప్పులు గుర్తించామని, సమగ్ర విచారణకు ఆదేశాలివ్వాలని కోరుతూ దస్త్రాన్ని జిల్లా ఉన్నతాధికారులకు పంపించారు. నెలరోజులు దాటినా ఇంకా నిర్ణయం వెలువడలేదు.


☛ ఇంకోవైపు పోలీసుల దర్యాప్తు కూడా కొలిక్కి రాకపోవడం గమనార్హం. అక్రమాలు బయటపడ్డ రోజు ప్రజాప్రతినిధులు అధికారులతో మాట్లాడి వీలైనంత తొందరగా రైతులకు న్యాయం చేయాలని సూచించారు. అయినా అధికారుల్లో స్పందన లేకపోవడం గమనార్హం.

☛ ఎవరి స్థాయిలో వారు మాకెందుకులే అన్న ధోరణితో వ్యవహరిస్తుండడం వల్లనే విచారణ ముందుకు సాగడం లేదు. ఈలోగా అప్రమత్తమైన అక్రమార్కులు వ్యవహారాలను చక్కబెట్టుకునే పనులను వేగవంతం చేశారు. మిర్చి నిల్వ పేరుతో తీసుకున్న రుణాల బకాయిలు చెల్లించి తప్పులు జరగలేదని చూపడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

లాభం మూడింతలు పూయించేలా..

ప్రయోగాత్మకంగా అధిక సాంద్రతతో పత్తి సేద్యం

ఎకరాకు రూ.5 వేల చొప్పున ప్రోత్సాహకం



అధిక సాంద్రత విధానంలో సాగు చేసిన పత్తి పంట

ఈనాడు-అమరావతి

ప్రధాన వాణిజ్య పంట పత్తి కొన్నాళ్లుగా ఒడిదొడుకులు ఎదుర్కొంటోంది. గులాబీ రంగు పురుగు, బీడీవీడలతో పెట్టుబడులు పెరిగి దిగుబడులు తగ్గడంతో రైతులు సాగుకు వెనకడుగు వేస్తున్నారు. వానాకాలం మిగతా పంటలతో పోల్చినప్పుడు పత్తి మొక్క అధిక తేమ పరిస్థితి, అధిక వేడి వాతావరణాన్ని తట్టుకునే లక్షణం కలిగి ఉంది. ఇందులోని అనుకూల సుగుణాలను కాపాడుకుంటూ ప్రతికూల అంశాలను అధిగమించి సేద్యాన్ని గిట్టుబాటుగా మార్చడానికి అధిక సాంద్రత విధానం అనే ఒక నూతన ఒరవడికి జాతీయ పత్తి పరిశోధన స్థానం శ్రీకారం చుట్టింది. మొక్కల సంఖ్యను మూడు రెట్లకు పెంచి తద్వారా అధిక దిగుబడి సాధించడం దీని ప్రధాన ఉద్దేశం. ప్రయోగాత్మకంగా సాగుకు ముందుకొచ్చే రైతులకు ఆర్థికసాయం అందించి ప్రోత్సహిస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో గత ఏడాది నుంచి లాంఫాంలోని శ్రీవెంకటేశ్వర పశు వైద్యవిద్యాలయం కృషివిజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో అధిక సాంద్రత పత్తి సాగు జరుగుతోంది. నాగపూర్ కేంద్రంగా పనిచేస్తున్న జాతీయ పత్తి పరిశోధన సంస్థ సౌజన్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. లాం ఫాం కృషి విజ్ఞాన కేంద్రం రైతులకు విత్తనాలు నాటడం నుంచి పత్తి తీసే వరకు వివిధ దశల్లో అవగాహన కల్పిస్తోంది.

సాధారణం కంటే మూడు రెట్లు మొక్కలు

సంప్రదాయ సాగు విధానంలో ఎకరాకు 7 వేల పత్తి మొక్కలు ఉంటే అధిక సాంద్రత విధానంలో 20 వేల మొక్కలు సాగు చేస్తారు. ఈ విధానంలో మొక్కల సంఖ్య పెరిగినప్పుడు గాలి, వెలుతురు ప్రసరించక కిరణజన్య సంయోగక్రియకు ఆటంకం ఏర్పడకుండా మొక్కలు ఎక్కువ ఎత్తు పెరగకుండా రసాయనాలను చల్లుతారు. అవసరాన్ని అనుసరించి పంట కాలంలో 40-45, 55-65 రోజుల వ్యవధిలో రసాయనాలు పిచికారీ చేస్తారు. సారవంతమైన నేలలు, అధిక వర్షపాతం వల్ల మొక్కలు ఎక్కువగా పెరిగితే మూడోసారి కూడా రసాయనాలు చల్లాల్సి ఉంటుంది. దీంతోపాటు 150 రోజులకు పంట పూర్తయ్యేలా జాగ్రత్తలు తీసుకుంటారు. పశువులు, ట్రాక్టర్లతో అంతరసేద్యం చేయడానికి అనువుగా మధ్యలో ఖాళీ అలాగే ఉంచి వరుసల్లో మాత్రం మొక్కల మధ్య దూరాన్ని తగ్గిస్తారు. ఈ పరిజ్ఞానాన్ని ఇప్పుడిప్పుడే రైతుల్లోకి తీసుకెళ్తున్నారు. పత్తి పంట ఐదారు నెలలు పైగా దీర్ఘకాలికంగా సాగులో ఉంటుంది. సాధారణంగా నవంబరు, డిసెంబరు మాసాల్లో సంభవించే అధిక వర్షాలు, తుపాన్లతో చేతికొచ్చిన పంట దెబ్బతిని రైతులు నష్టపోతున్నారు. అధిక సాంద్రత విధానంలో పండించడం వల్ల సాగు సమయం 150 రోజులకు పరిమితం చేయవచ్చు. దీంతో తుపాన్ల నుంచి ఉపశమనం కలుగుతుంది. ఏకపంటగా పత్తిని సాగు చేసే పరిస్థితి నుంచి డిసెంబరులో రెండో పైరుగా శనగ, మొక్కజొన్న, పొగాకు తదితర స్వల్పకాలిక పైర్లను వేసుకోవడానికి అవకాశం ఏర్పడటం కర్షకులకు కలిసివస్తుంది.

రైతుల ఆదాయం పెంచడంలో తోడ్పాటు

రైతుల ఆదాయం పెంచడంలో అధిక సాంద్రత విధానం ఎంతగానో తోడ్పడుతుంది. ప్రస్తుత పత్తిలో గులాబీ రంగు పురుగు సమస్యగా ఉంది. బీటీ విత్తనాల రాకతో పంటకు 120రోజుల వరకు గులాబీ రంగు పురుగు ఆశించదు. దీనిని దృష్టిలో ఉంచుకుని పంట కాలం తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నాం. అధిక సాంద్రత విధానంలో పంట కాలం తగ్గడంతోపాటు పీతల సంఖ్య కూడా తగ్గుతుంది. ఈ విధానాన్ని ప్రోత్సహించడానికి నాగపూర్‌లోని జాతీయ పత్తి పరిశోధన స్థానం వారు ఎకరానికి రూ. 5వేలు చొప్పున రైతుకు గరిష్ఠంగా 4 ఎకరాలకు ప్రోత్సాహం ఇస్తున్నారు. ఈ విధానంలో సాగు చేయడానికి 625 ఎకరాల్లో సాగు చేయడానికి రైతులు ముందుకొచ్చారు. నేరుగా వారి ఖాతాల్లోకి ప్రోత్సాహక సొమ్ము జమచేస్తున్నాం. రూ. 31.25 లక్షల సొమ్ము సాగుదారులకు అందుతోంది.

- డాక్టర్ యుగంధర్‌కుమార్, ప్రధాన శాస్త్రవేత్త, కేవీకే



చంద్రబాబు, పవన్ కల్యాణ్, పెమ్మసాని చంద్రశేఖర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి నినాదాలు చేస్తున్న కనపర్తి శ్రీనివాసరావు, కూటమి నాయకులు

చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధి పథంలో ఆంధ్రప్రదేశ్

పట్టాభిపురం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గుంటూరులోని శంకరవిలాస్ ఓవర్‌బ్రిడ్జి విస్తరణ, అభివృద్ధికి కేంద్రం రూ.98 కోట్లు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ల చిత్రపటాలకు లాడ్జి సెంటర్‌లో గురువారం పాలాభిషేకం చేశారు. కనపర్తి మాట్లాడుతూ కాగితాలకే పరిమితమైన శంకరవిలాస్ ఓవర్‌బ్రిడ్జి అభివృద్ధికి ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ నిధులు మంజూరు చేయించారన్నారు. రూ.250 కోట్లతో అమరావతిలో టెక్నాలజీ సెంటర్, ప్రత్తిపాడు నియోజకవర్గంలో 100 పడకల ఈఎస్ఐ ఆసుపత్రికి అనుమతులు తీసుకొచ్చారన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అప్పులతో జగన్ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసినప్పటికీ చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పయనింపజేసేందుకు శ్రమిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర నాయకులు బొనబోయిన శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ షేక్ షజీల, కార్పొరేటర్లు వేములపల్లి శ్రీరాంప్రసాద్, కొమ్మినేని కోటేశ్వరరావు, నూకవరపు బాలాజీ, మానం పద్మశ్రీ, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

పాడి రైతులకు వరం

లింగ నిర్ధారిత వీర్యం

పెయ్య దూడలకు పెరుగుతున్న డిమాండ్



లింగ నిర్ధారిత వీర్య పరిజ్ఞానంతో పొత్తూరులో పుట్టిన పెయ్య దూడలను పరిశీలిస్తున్న జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి నరసింహారావు

ఈనాడు – అమరావతి

చూడి గేదెలు పెయ్యదూడలకు జన్మనిస్తే పశుపోషకులు మహాలక్ష్మిగా భావిస్తారు. ఆ దూడలే పుట్టేలా రూపొందించిన లింగ నిర్ధారిత వీర్య పరిజ్ఞానం క్రమంగా రైతులకు చేరువవుతోంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈ విధానంలో చేసిన కృత్రిమ గర్భధారణ ఇంజెక్షన్ల ద్వారా పెయ్యదూడలు జన్మిస్తున్నాయి. పైగా 90 శాతం కచ్చితత్వం ఉంటోంది. ఇలా పుట్టిన దూడలు పూర్తి ఆరోగ్యంతో జీవిస్తున్నాయని పశుసంవర్ధకశాఖ అధికారులు చెబుతున్నారు. ఒకప్పుడు పల్లెల్లో ఆవులు, గేదెలు పాల దిగుబడికి; ఎద్దులు, దున్నలు వ్యవసాయ పనుల్లో ఉపయోగపడేవి. ఇటీవలకాలంలో సాగులో యంత్ర పరికరాలు రావడంతో ఎద్దులు, దున్నల అవసరం చాలావరకు తగ్గిపోయింది. ఈ నేపథ్యంలో రైతులు పాడి ద్వారా ఆదాయం కోసం పెయ్యదూడలనే కోరుకుంటున్నారు. ఇది గుర్తించిన ప్రభుత్వం సెక్స్ సార్టెడ్ సెమన్ (లింగ నిర్ధారిత వీర్యం) పరిజ్ఞానం అందుబాటులోకి తెచ్చారు. గతేడాది నుంచి ఉమ్మడిజిల్లాలో ఈ కృత్రిమ గర్భధారణ విజయవంతమవుతోంది.

పశుపోషకుల ఆసక్తి

ఉమ్మడి జిల్లాలో గేదెల ద్వారా పాల ఉత్పత్తి ఎక్కువ. ఒక గేదె పెయ్యకు జన్మనిస్తే అది మూడేళ్ల తరువాత గర్భం దాలుస్తుంది. ఈ గేదె ఖరీదు బహిరంగ మార్కెట్లో రూ. 60 వేల నుంచి రూ. లక్ష వరకు ఉంటోంది. అదే మగ దూడ ఖరీదు మూడేళ్లకు కేవలం రూ. 20 వేలే. పెయ్య గేదెగా మారితే 8 నుంచి 10 ఈతలు ఈనుతుంది. గేదె రోజుకు సగటున 6 లీటర్ల చొప్పున 8 నెలల పాటు పాలు ఇస్తుంది. లీటరు రూ. 60 చొప్పున లెక్కేస్తే రూ. 86,400 ఆదాయం వస్తుంది. ఇలా పది ఈతలు ఈనితే ఒక్క గేదె ద్వారా రూ. 8.64 లక్షలు వస్తుంది. గేదె సంతతి ద్వారా కూడా ఇదే విధంగా ఆదాయం వస్తుంది. అందువల్లనే పశుపోషకులు పెయ్యదూడలు పుట్టడానికి లింగ నిర్ధారిత వీర్య పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటున్నారు.

రాయితీతో ప్రోత్సాహకం

లింగ నిర్ధారిత వీర్య పరిజ్ఞానాన్ని మరింతగా ప్రోత్సహించేందుకు రైతులకు రాయితీ ఇస్తున్నారు. ఒక్కో ఇంజక్షను ఖరీదు రూ. 1,350 కాగా రైతులకు రూ. 500కే అందిస్తున్నారు. ఈ మొత్తం చెల్లిస్తే రెండుసార్లు ఇంజక్షన్ చేస్తారు. అప్పటికీ గర్భధారణ రాకపోతే ఆ మొత్తం తిరిగిచ్చేస్తారు.

☛ ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు 40 వేలు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇందులో 4 వేలు లింగ నిర్ధారిత వీర్యం ఇంజక్షన్లు వేయాలని నిర్ణయించారు. లక్ష్యాన్ని చేరుకోవడానికి క్షేత్రస్థాయి యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. అనేకమంది రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారని గుంటూరు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి నరసింహారావు తెలిపారు. అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామన్నారు.

9 కొత్తగా మండలాల్లో అన్న క్యాంటీన్లు

రూ. 6.5 కోట్లతో అంచనాలు



పొన్నూరు, చేబ్రోలు, పెదకాకాని, న్యూస్‌టుడే: పట్టణాల్లో పేదల ఆకలి తీర్చేందుకు తెదేపా కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లు విజయవంతంగా నడుస్తున్నాయి. కేవలం రూ. 15తో మూడు పూటలా ఆహారం లభిస్తోంది. ఈ నేపథ్యంలో మండల కేంద్రాల్లోనూ అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజారోగ్యశాఖాధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. మొత్తం 9 చోట్ల వీటిని ఏర్పాటు చేసేందుకు రూ. 6.5 కోట్ల వ్యయం అవుతుందని పేర్కొన్నారు. ఒక్కో క్యాంటీన్ ఏర్పాటుకు రూ. 70 లక్షల నుంచి రూ. 75 లక్షల మధ్యలో ఖర్చవుతుందని అంచనా వేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారి పరిశీలనకు ప్రతిపాదనలు పంపించామని తెనాలి సబ్‌డివిజన్ ప్రజారోగ్యశాఖాధికారి ఏడుకొండలు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. మండల కేంద్రాల్లో ఉదయంపూట అల్పాహారం చేయడానికి రూ. 30 నుంచి రూ. 40 వరకు ఖర్చవుతోంది. భోజనానికైతే రూ. 100 వరకు వెచ్చించాల్సి వస్తోంది. అన్నక్యాంటీన్లు అందుబాటులోకి వస్తే నిరుపేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి.

అన్నక్యాంటీన్లు కొత్తగా ఏర్పాటు చేయనున్న ప్రాంతాలు	చేబ్రోలు, పెదకాకాని, కాలకలూరు, కొల్లిపర, పెదవడ్లపూడి, ఉండవల్లి, తాడికొండ, ప్రత్తిపాడు, పెరేచర్ల.

తెల్లరేషన్ కార్డుదారులకు

రాయితీపై వంట నూనెల విక్రయం



కలెక్టరేట్ (గుంటూరు), న్యూస్‌టుడే: ధరలు పెరిగిన నేపథ్యంలో తెల్ల రేషన్‌కార్డుదారులకు రాయితీపై వంట నూనెలు సరఫరా చేయడానికి పౌరసరఫరాలశాఖ చర్యలు చేపట్టింది. ఒక బియ్యం కార్డుదారునికి పామాయిల్ ప్యాకెట్ రూ. 110 చొప్పున మూడు, సన్ ఫ్లవర్ ఆయిల్ రూ. 124కు ఒక ప్యాకెట్ విక్రయించనుంది. వీటి కొనుగోలుకు వెళ్లినప్పుడు కార్డుదారులు తమ వెంట రేషన్‌కార్డు తప్పనిసరిగా తీసుకెళ్లాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కోమలి పద్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎక్కడెక్కడ విక్రయిస్తారంటే

☛ గుంటూరు నగరంలో ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని రైతు బజార్, చుట్టుగుంట రైతు బజార్, పట్నంబజారులోని 11 హోల్‌సేల్ దుకాణాలు..

☛ తెనాలిలోని రెండు రైతుబజార్లతోపాటు 22 హోల్‌సేల్ దుకాణాలు.

☛ పొన్నూరు రైతు బజార్‌తోపాటు 6 హోల్‌సేల్ దుకాణాలు.

☛ మంగళగిరిలోని 4, చేబ్రోలు, ప్రత్తిపాడు, కాకుమాను, పెదనందిపాడుల్లోని ఒక్కోటి చొప్పున హోల్‌సేల్ దుకాణాలు.

బోరుగడ్డ అనిల్‌పై...

ఆధారాలతో వస్తే కేసులు నమోదు చేస్తాం



మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్ కుమార్‌పై రాష్ట్రవ్యాప్తంగా 17 కేసులు నమోదైనట్లు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. గురువారం రాత్రి గుంటూరు జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అనిల్‌కుమార్ 2018లో ఐఏఎస్ అధికారినని పలువురిని మోసగించిన కేసులో అనంతపురంలో అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 17 కేసులు నమోదుకాగా రెండు కేసులు పూర్తవ్వగా.. మిగిలినవి దర్యాప్తులో ఉన్నాయన్నారు. గుంటూరు జిల్లాలో 8, మరికొన్ని కృష్ణా, అనంతపురం జిల్లాల్లో ఉన్నాయని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లపై సామాజిక మాధ్యమాలలో అనుచితంగా మాట్లాడిన దాఖలాలు ఉన్నాయని, వాటిపై సుమోటోగా కేసులు నమోదు చేస్తారా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ ఆ వీడియోలు పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. మరికొన్ని కేసులపై అతన్ని పీటీ వారెంట్ దాఖలు చేసి అదుపులోకి తీసుకొని విచారిస్తామన్నారు. అనిల్‌కుమార్‌కు సంబంధించిన బాధితులు ఇంకా ఎవరైనా ఉంటే ఆధారాలతో వస్తే వాటిపైనా కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకొని ఎవరైనా రాజకీయనాయకులు, ప్రముఖులు, మహిళలపట్ల వ్యక్తిగత పరువు, ప్రతిష్ఠలకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేసి పోస్టింగ్ పెడితే వారిపై కేసు నమోదు చేస్తామన్నారు. తొలిసారి 41 నోటీసులు జారీ చేస్తామని, రెండోసారి అదేవిధంగా పోస్టింగ్‌లు పెడితే కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు పంపాలని కోరతామన్నారు.

రెండు గంటలకుపైగా విచారణ

పట్టాభిపురం, నగరంపాలెం, గుంటూరు లీగల్, న్యూస్‌టుడే: గత ఎన్నికల ఫలితాలు వెల్లడైన నాటి నుంచి అజ్ఞాతంలో ఉన్న రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌కు మార్‌ను అరండల్‌పేట ఠాణాలో పశ్చిమ వలయ డీఎస్పీ జయరాంప్రసాద్, పట్టాభిపురం సీఐ వీరేంద్రబాబు, అరండల్‌పేట సీఐ కొంకా శ్రీనివాసరావు రెండు గంటలకుపైగా విచారించారు.

☛ రౌడీషీటర్ అనిల్‌కుమార్‌ను నల్లపాడు పోలీసులు వైద్య పరీక్షల నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. అతడిని పరీక్షించిన వైద్యులు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని ధ్రువీకరించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో పెట్రేగిపోయిన అనిల్‌కుమార్ గతంలో జీజీహెచ్‌లోనూ దౌర్జన్యంగా ప్రవర్తించిన ఘటనను సిబ్బంది గుర్తు చేసుకున్నారు.

రాజమహేంద్రవరం జైలుకు తరలింపు : అనిల్‌కు ఈ నెల 29వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ గుంటూరు ఐదో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె. లత ఉత్తర్వులు జారీ చేశారు. కర్లపూడి బాబూప్రకాష్‌ను డబ్బుల కోసం బెదిరించడంతో 2021లో పోలీసులు కేసు నమోదు చేశారు. రాజకీయ పలుకుబడితో అరెస్ట్ కాకుండా ఇన్నాళ్లూ తప్పించుకు తిరిగారు. 17కు పైగా నేరపూరితమైన కేసులున్నాయని జ్యుడిషియల్ రిమాండ్ విధించమని పోలీసులు న్యాయమూర్తిని కోరారు. తనను గుంటూరు లేదా నరసరావుపేట జైలుకు తరలించమని అనిల్ కోరగా.. గుంటూరు కారాగారంలో ఖాళీ లేదని, నెల్లూరు జైలుకు తరలించాలని న్యాయమూర్తి ఆదేశించారు. అక్కడ తనకు ప్రాణహాని ఉందని అనిల్ పేర్కొనడంతో చివరకు రాజమహేంద్రవరం జైలుకు తరలించాలని న్యాయమూర్తి ఆదేశించారు.



అనిల్‌కుమార్‌ను కోర్టుకు తరలిస్తున్న పోలీసులు

మంగళగిరి అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో సమూల మార్పులు

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా మంగళగిరిలోని అంతర్జాతీయ క్రికెట్ మైదాన నిర్మాణంలో సమూల మార్పులు చేయబోతున్నామని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని చెప్పారు. గురువారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ మార్పులు చేసేందుకు అంతర్జాతీయ స్థాయి ఆర్కిటెక్చర్‌ను, కన్సల్టెన్సీ సంస్థను నియమించామన్నారు. వచ్చే ఏడాదిన్నరలోపు అన్ని పనులు పూర్తిచేస్తామన్నారు. ఒక అంతర్జాతీయ స్థాయి క్రికెట్ మైదానానికి కావాల్సిన సదుపాయాలు ఇక్కడ లేవన్నారు. పార్కింగ్ కోసం 15 ఎకరాల స్థలం కోసం ప్రభుత్వానికి లేఖ రాశామన్నారు. కృష్ణా, గుంటూరు జిల్లాల క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా బెంగళూరు చినస్వామి మైదానంలో ఏ తరహా సదుపాయాలు ఉన్నాయో, ఇక్కడా అలాంటి వసతులతో స్పోర్ట్స్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. 25వేల మంది కూర్చొనేలా అప్పుడు నిర్మించారని, దానిని 50 వేలకు పెంచబోతున్నామన్నారు. దీనిపై ఎంఈపీ కన్సల్టెన్సీ సంస్థ నివేదిక ఇస్తోందని, అది రాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. సీఎం చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా అంతర్జాతీయ క్రికెట్ మైదానాన్ని ఇక్కడ నిర్మిస్తున్నామని ఎంపీ తెలిపారు. క్రికెట్‌ను ప్రోత్సహించేందుకు ప్రభుత్వ సహకారంతో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిసెంబరు 20 నుంచి జనవరి 20 వరకు రాష్ట్రంలో మండలం, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

ట్రాఫిక్ సాఫీగా వెళ్లేలా..

నగరంలో 12 చోట్ల సిగ్నల్స్ ఏర్పాటుకు చర్యలు

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: గుంటూరు నగరంలోని రద్దీ రహదారుల్లో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ పని చేయకపోవడంతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రద్దీ సమయాల్లో ట్రాఫిక్ గంటలపాటు నిలిచిపోతోంది. హిందూ కాలేజి కూడలి, పాతబస్టాండ్, బృందావన్‌గార్డెన్స్ తదితర ప్రాంతాల్లో సిగ్నల్స్ ఏనాడో మూలనపడ్డాయి. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ వ్యవస్థను కొలిక్కి తెచ్చేందుకు అధికారులు రంగంలోకి దిగారు. సిగ్నలింగ్ వ్యవస్థ టెండర్లు దక్కించుకున్న గుత్తేదారుతో మాట్లాడారు. హిందూ కాలేజి కూడలి, ఎత్తురోడ్డు, హిమనీ కూడలి, పాతబస్టాండ్, బస్టాండ్, కొత్తపేట, లక్ష్మీపురం మదర్‌థెరెసా కూడలి, అరండల్‌పేట, శ్రీనగర్, బృందావన్ గార్డెన్స్, చిల్లీస్, చుట్టుగుంట ప్రాంతాల్లో సిగ్నల్స్ వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సీసీ కెమెరాలను కూడా ఆయా ప్రాంతాల్లో అమర్చారు. ఇకపై నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



పాతబస్టాండ్ కూడలిలో పనిచేయని ట్రాఫిక్ సిగ్నల్స్

జీబ్రాలైన్లు.. ఇతర సూచిక బోర్డులేవీ? : ప్రధాన, రద్దీ రహదారుల్లో జీబ్రా లైన్లు, ఇతర సూచిక బోర్డుల ఏర్పాటును జీఎంసీ ప్రణాళిక విభాగం పట్టించుకోవడం లేదు. రహదారుల మార్జిన్లు ఆక్రమణలకు గురికాకుండా చూడాల్సి ఉన్నా నిర్లక్ష్యం వహిస్తోంది. వెండార్ జోన్ల ఏర్పాటు కొలిక్కి వచ్చేంతవరకు ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది.

డీఎస్సీ ఉచిత శిక్షణ

★ నిరుపేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రయోజనం
★ 21 వరకు దరఖాస్తుకు అవకాశం

జిల్లాపరిషత్తు (గుంటూరు), న్యూస్‌టుడే



శిక్షణ పొందిన విద్యార్థులు (పాత చిత్రం)

ఉపాధ్యాయులు కావాలనే ఆశయంతో బీఈడీ, డీఈడీ కోర్సులతో పాటు తెలుగు, హిందీ పండిట్ ట్రైనింగ్ కోర్సులు అభ్యసించిన విద్యార్థులు డీఎస్సీ ప్రకటన కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూశారు. గత వైకాపా ప్రభుత్వం నాలుగున్న రేళ్లు కాలహరణం చేసి సాధారణ ఎన్నికలు-2024కు మూడు నెలల ముందు నామమాత్ర పోస్టులతో డీఎస్సీ ప్రకటన విడుదల చేసి కేవలం 40 రోజుల వ్యవధిలోనే పరీక్షలు నిర్వహించేందుకు నిర్ణయించింది. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల వరకు డీఎస్సీ నిర్వహణను వాయిదా వేసింది. ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలోని ఎన్డీఏ కూటమి విజయం సాధించి ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన విధంగా మెగా డీఎస్సీ పోస్టుల భర్తీపై సీఎం సంతకం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 16 వేల పోస్టులను భర్తీ చేయనున్నారు. దీనిలో భాగంగా ఉపాధ్యాయ అర్హత పరీక్ష-2024ని ఈనెల 3వ తేదీ నుంచి నిర్వహిస్తున్నారు. 25వ తేదీ వరకు జరగనున్నాయి. నవంబరు 2న టెట్ పరీక్ష ఫలితాలు ప్రకటించిన తర్వాత 3న డీఎస్సీ ప్రకటన విడుదల చేస్తారని భావిస్తున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ కోసం ఉచిత శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నారు.

అక్టోబరు 30న ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. నవంబరు 3న ఆయా శిక్షణ సంస్థలకు అభ్యర్థులను కేటాయిస్తారు. 6న శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయి.

దరఖాస్తుల స్వీకరణ

ఉపాధ్యాయ విద్య కోర్సులు పూర్తి చేసి టెట్‌లో అర్హత సాధించిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు డీఎస్సీ ఉచిత శిక్షణకు అర్హులు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో జ్ఞానభూమి పోర్టల్ https://jnanabhumi.ap.gov.inలో ఈనెల 21 వరకు దరఖాస్తు చేసుకోవడానికి గడువుగా నిర్ణయించారు. ఆన్‌లైన్‌లో స్క్రీనింగ్ టెస్ట్ 27న నిర్వహిస్తారు. ఈ పరీక్షలో వచ్చిన మార్కులకు టెట్ మార్కులు 15 శాతం వరకు వెయిటేజీ ఇచ్చి అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎంపికయిన వారికి 3 నెలలు ఉచితంగా రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నారు.

ఎవరికెంత ఖర్చు చేయనుందంటే..

★ ఎస్జీటీ అభ్యర్థులకు శిక్షణ కోసం ఫీజు రూ.10 వేలు, స్టడీ మెటీరియల్‌కు రూ.3 వేలు, డైట్ బిల్లు నెలకు రూ.4,500 చొప్పున మూడు నెలలకు రూ.13,500 కలిపి మొత్తం ఒక అభ్యర్థిపై రూ.26,500 చొప్పున ప్రభుత్వం ఖర్చు చేయనుంది.

★ స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులకు శిక్షణ కోసం ఫీజు రూ.12 వేలు, స్టడీ మెటీరియల్‌కు రూ.3 వేలు, డైట్ బిల్లు మూడు నెలలకు రూ.13,500 కలిపి మొత్తం రూ.28,500 ప్రభుత్వం వ్యయం చేయనుంది.

భారం తగ్గినట్లే..

డీఎస్సీకి ఉచిత శిక్షణ ఇవ్వనుండటంతో ఎస్సీ, ఎస్టీ వర్గాల నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రయోజనం కలగనుంది. ప్రయివేట్ శిక్షణ సంస్థల్లో డీఎస్సీ శిక్షణకు రూ.వేలల్లో ఫీజులు చెల్లించాల్సి వస్తోంది. దీనికి తోడు హాస్టల్‌లో ఉంటే నెలకు మరో రూ.5 వేల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. అద్దెకు ఇళ్లలో రూమ్‌లు తీసుకోవాలన్నా ఆర్థికంగా భారం పడుతుంది. కూటమి ప్రభుత్వం సామాజిక, ఆర్థికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ వర్గాల నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులు ప్రభుత్వ ఉద్యోగాలు పొందేలా ఉచిత శిక్షణకు నిర్ణయం తీసుకోవడంతో లబ్ధి కలగనుంది. ఈనెల 12 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు నింపే కార్యక్రమం ప్రారంభమవడంతో అభ్యర్థులు దరఖాస్తు చేసుకుంటున్నారు.

యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు చర్యలు



కమిటీ సభ్యులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

జిల్లాపరిషత్తు (గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలోని యువతలో నైపుణ్యాభివృద్ధి పెంపొందించి స్వయం ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో నైపుణ్యాభివృద్ధి కమిటీ సభ్యులతో కలెక్టర్ సమీక్ష సమావేశాన్ని గురువారం నిర్వహించి మాట్లాడారు. నూతన ప్రభుత్వం అమరావతి రాజధాని ప్రాంతంలో సివిల్ పనులు చేస్తుండటంతో నిర్మాణ, సర్వే రంగాలకు ఎక్కువ డిమాండ్ ఉందన్నారు. తాపీ పని, ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్, కార్పెంటర్, పీవోపీ, పాల్ సీలింగ్‌లలో యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించాలని వివరించారు. మంగళగిరిలో చేనేత పరిశ్రమ దేశ వ్యాప్తంగా పేరుగాంచిందని, అక్కడ క్లస్టర్లు ఏర్పాటు చేసి వృత్తి నైపుణ్యం పెంచేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలల్లో నైపుణ్య హబ్‌లు ఏర్పాటు చేయాలని, ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనలో ప్రాథమిక, మధ్యస్థ శిక్షణ ఇవ్వాలని పేర్కొన్నారు. సీడాప్ ద్వారా కలిసి నిరుద్యోగ యువతకు ప్రయివేటు రంగంలో ఉద్యోగ మేళాలు నిర్వహించి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి రమావతి తెలిపారు. అగ్రికల్చర్ సంబంధిత రంగాల్లోనూ నైపుణ్య శిక్షణ ఇవ్వాలని సభ్యులు సూచించారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ టి.వి.విజయలక్ష్మి, డీఎస్ డీవో ఎస్.సంజీవరావు, నైపుణ్యాభివృద్ధి సంస్థ అదనపు మేనేజర్ ప్రసన్నకుమార్, సీడాప్ జిల్లా మేనేజర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ శిక్షణకు సంస్థల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: రాష్ట్ర సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో డీఎస్సీకి హాజరయ్యే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచితంగా రెసిడెన్షియల్ విధానంలో ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని శిక్షణ సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు డి.మధుసూదనరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే సంస్థలు గత రెండు డీఎస్సీ రిక్రూట్‌మెంట్లకు శిక్షణ ఇచ్చి కనీసం 100 మంది అభ్యర్థులు ఉపాధ్యాయులుగా ఎంపికై ఉండాలన్నారు. దరఖాస్తులను https://tender.apeprocurement.gov.in లో ఈనెల 21 లోపు అప్‌లోడ్ చేయాలని కోరారు.

మాస్టర్‌మైండ్స్ విద్యార్థినికి సీఎం అభినందన



తేజస్వినిని అభినందిస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో మాస్టర్‌మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్

నగరపాలక సంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: గతంలో విడుదలైన ఆలిండియా సీఏ ఫైనల్ ఫలితాల్లో మొదటి ర్యాంకు సాధించిన మాస్టర్‌మైండ్స్ విద్యార్థిని కొత్తపేట తేజస్వినిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర సచివాలయంలో ఆయన ఛాంబర్‌లో అభినందించారు. ఈ సందర్భంగా మాస్టర్‌మైండ్స్ యాజమాన్యం, సిబ్బందికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబును కలిసిన విద్యాసంస్థల అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.7 లక్షలు డీడీని వరద బాధితుల సహాయార్థం అందజేశారు.

డిగ్రీ సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల



సప్లిమెంటరీ ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ ఆచార్య గంగాధర్ తదితరులు

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో ఆగస్టులో నిర్వహించిన 5, 6 సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ గురువారం విడుదల చేశారు. 5వ సెమిస్టర్‌లో 4095 మంది, ఆరో సెమిస్టర్‌లో 202 మంది ఉత్తీర్ణులయ్యారు. మరిన్ని వివరాలను విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో ఉంచామని సీఈ శివప్రసాదరావు చెప్పారు. పునఃమూల్యాంకన కోసం నవంబరు 2లోపు రూ.1490 చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, డిగ్రీ పరీక్షల సమన్వయకర్త ఆచార్య కృష్ణారావు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సిద్ధయ్య, పరిశోధన సెల్ సమన్వయకర్త డాక్టర్ సుధాకర్, పరీక్షల నోడల్ అధికారి రెడ్డి ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: రాబోయే ఒలింపిక్స్‌లో జిమ్నాస్టిక్స్ విభాగంలో భారత్ స్వర్ణం సాధించే దిశగా అడుగులు వేయాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ పేర్కొన్నారు. గుంటూరు బ్రహ్మానంద రెడ్డి స్టేడియంలో రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి క్రీడాకారులు తరలివచ్చారు. ఈనెల 19వ తేదీ వరకు పోటీలు కొనసాగనున్నాయి. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఏపీలో అంతర్జాతీయ స్థాయి జిమ్నాస్టిక్స్ క్రీడాకారులు ఉన్నారని, వీరు మరింతగా శ్రమించి రాబోయే ఒలింపిక్స్‌లో మెరుగైన ఫలితాలు వచ్చేలా కృషి చేయాలన్నారు. క్రీడలతో శారీరక, మానసిక ఉత్తేజం చేకూరుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలన్నారు. విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించేందుకు క్రీడలు దోహదపడతాయన్నారు. జిమ్నాస్టిక్స్ పరికరాలకు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సహకారంతో రూ.35 లక్షలు మంజూరయ్యాయన్నారు. బీఆర్ స్టేడియాన్ని త్వరలోనే అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో జిమ్నాస్టిక్స్ ఏపీ అధ్యక్షుడు ఆర్.పి.ఆర్.విఠల్, కార్యదర్శి సుబ్బారావు, తెనాలి డబుల్ హార్స్ ఛైర్మన్ మోహన్ శ్యాంప్రసాద్, డీఎస్‌డీఓ నరసింహారెడ్డి, ఒలింపిక్ సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జిమ్నాస్టిక్స్‌లో చిన్నారి విన్యాసం

డీఐవోగా శ్రావణబాబు



గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిగా శ్రావణబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన సుబ్బరాజు కాకినాడకు బదిలీపై వెళ్లారు. ఈమేరకు రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు పద్మావతి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో శ్రావణబాబు ఇన్‌ఛార్జి డీఎంహెచ్‌వోగా పని చేశారు. చిన్న పిల్లల వైద్య నిపుణులైన ఆయనకు డీఐవోగా ప్రభుత్వం అవకాశం ఇచ్చింది.

చేబ్రోలులో 64 మి.మీ వర్షపాతం

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలో బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు సగటున 15.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో అధికంగా చేబ్రోలు మండలంలో 64 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. గడిచిన 16 రోజుల్లో ఈ మండలంలో 95.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా.. బుధవారం ఒక్కరోజే 64 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అధిక వర్షంతో నీట మునిగిన పంటలను కాపాడుకునేందుకు రైతులు ప్రయత్నాలు చేస్తున్నారు. దుగ్గిరాల 38.8, వట్టిచెరుకూరు 36.8, కొల్లిపర 28.2, కాకుమాను 22.2, పొన్నూరు 22, ప్రత్తిపాడు 12.8, తెనాలి 12.6, తాడికొండ 11.8, పెదనందిపాడు 11.2, తుళ్లూరు 8.8, పెదకాకాని 4.2, గుంటూరు పశ్చిమ 4, మేడికొండూరు 2.2, మంగళగిరి 1.8, గుంటూరు తూర్పు 1, ఫిరంగిపురం 1, తాడేపల్లి 0.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

20న చలపతిలో రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు

తుళ్లూరు, న్యూస్‌టుడే: చలపతి ఫార్మసీ, ఫార్మాస్యూటికల్ కళాశాలలు, ఆనంద్ చెస్ వింగ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 20న తెలుగు రాష్ట్రాల ఓపెన్ చెస్ టోర్నమెంట్- 2024 పోటీలు జరగనున్నాయి. చలపతి ఫార్మసీ కళాశాల, లాంలో నిర్వహించనున్న ఈ పోటీల గోడపత్రికలను ప్రిన్సిపల్ నాదెండ్ల రామారావు తదితరులు గురువారం విడుదల చేశారు. ఈ పోటీల్లో విజేతలకు 80 వేల నగదు బహుమతి అందజేస్తామని చెప్పారు. వివరాలకు 9703049378కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు.

నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ వేళలు మార్పు

గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: లింగంపల్లి నుంచి సికింద్రాబాద్, గుంటూరు మీదుగా తిరుపతి వెళ్లే నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్(12734) రైలు వెళ్లే సమయం మారిందని అధికారులు తెలిపారు. ఈ రైలు లింగంపల్లిలో 17.30 గంటలకు బయలుదేరి, సికింద్రాబాద్ 18.05, నడికుడి 20.34, పిడుగురాళ్ల 20.54, సత్తెనపల్లి 21.22, గుంటూరు 22.55, తిరుపతి 05.55 గంటలకు చేరుతుందని తెలిపారు. అదే విధంగా నవంబరు 1వ తేదీ నుంచి ముందస్తు రిజర్వేషన్ గడువును 120 రోజుల నుంచి 60 రోజులకు తగ్గించినట్లు పేర్కొన్నారు.

బీసీ రక్షణ చట్టం.. బడుగులకు కవచం



ఎన్టీఆర్, ఫులె విగ్రహాలకు నివాళులర్పించిన తెదేపా నాయకులు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: బీసీ రక్షణ చట్టం.. బడుగు, బలహీనవర్గాలకు కవచంలా ఉపయోగపడుతుందని తెదేపా బీసీ విభాగం అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ పేర్కొన్నారు. బీసీల రక్షణ చట్టం అమలుకు విధి, విధానాలు రూపొందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు బీసీ మంత్రులు సమావేశమవడం, స్వర్ణకారుల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా తెదేపా జిల్లా కార్యాలయంలో గురువారం పార్టీ నాయకులు మిఠాయిలు పంచుకుని వేడుకలు నిర్వహించారు. మహాత్మా జ్యోతిరావు ఫులె, ఎన్టీఆర్ విగ్రహాలకు నివాళులర్పించి నినాదాలు చేశారు. వేములకొండ మాట్లాడుతూ 'వెనుకబడిన తరగతులు గౌరవప్రదమైన జీవనం అందించడమే లక్ష్యంగా బీసీ రక్షణ చట్టం ప్రభుత్వం రూపొందిస్తుంది. గత ఎన్నికలకు ముందు బీసీలకు ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చేందుకు చంద్రబాబు కృతనిశ్చయంతో ఉన్నారు. జగన్ అయిదేళ్ల పాలనలో బీసీల ఆస్తులకు, ప్రాణాలకు రక్షణ లేకుండా పోయింది. ఓటు బ్యాంకు రాజకీయాలకు బలైపోతున్న పేదలను ఆదుకోవాలన్న సంకల్పంతో చంద్రబాబు బీసీ డిక్లరేషన్ ప్రకటించారు. స్వర్ణకారుల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి చిత్తశుద్ధి నిరూపించుకున్నారు'.. అని పేర్కొన్నారు. జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను చంద్రబాబు ప్రాధాన్య క్రమంలో నెరవేరుస్తున్నారు. అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే పలు హామీలు నెరవేర్చి ప్రజలతో ఇది మంచి ప్రభుత్వం అని అభినందనలు అందుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మల్లె ఈశ్వరరావు, తెదేపా నాయకులు మాదాల చినకొండలరావు, తుమ్మేటి మురళి, గట్టి శ్రీనివాస్, గొడుగు శంకర్, నక్కల అగస్టీన్, షేక్ చినబాజి, పాటిబండ్ల బలరాం, హుస్సేన్, రామారావు, సుభాని తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ



కాంస్య పతకంతో క్రీడాకారిణి జ్యోతివర్మ

మంగళగిరి, న్యూస్‌టుడే : గోవాలో ఈ నెల 14 నుంచి 18 వరకు జరుగుతున్న జాతీయ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్ మెన్ అండ్ ఉమెన్ బెంచ్‌ప్రెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో గుంటూరుకు చెందిన మహిళా పవర్‌లిఫ్టర్ జ్యోతివర్మ మూడోస్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించినట్లు పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయభాస్కర్‌రావు, షేక్ సందాని గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మాస్టర్స్- 2 విభాగంలో 69 కిలోల విభాగంలో ఆమె మూడో స్థానం సాధించారు. క్రీడాకారిణిని పలువురు అభినందించారు.

రైఫిల్ షూటింగ్‌లో ఐదు బంగారు పతకాలు



విద్యార్థి ముఖేష్‌కు జ్ఞాపిక అందిస్తున్న వీసీ డాక్టర్ పార్థసారథివర్మ తదితరులు

తాడేపల్లి, న్యూస్‌టుడే : లిమాలో గత నెల 26 నుంచి ఈ నెల 7 వరకు జరిగిన జూనియర్ ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ తరపున ప్రాతినిధ్యం వహించిన కేఎల్‌యూ విద్యార్థి నేలవల్లి ముఖేష్ రైఫిల్ షూటింగ్‌లో ఐదు బంగారు, రెండు కాంస్య పతకాలు సాధించినట్లు విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ పార్థసారథివర్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థి ముఖేష్‌ను పలువురు ఆచార్యులు, సహచర విద్యార్థులు అభినందించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో |కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, రిటైల్ ధర - 152, చికెన్ విత్‌స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 135, 144, 155 చికెన్ విత్ స్కిన్ - 260 చికెన్ స్కిన్‌లెస్ - 270.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 510 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

గుంటూరు కేంద్రంగా నకిలీ పురుగు మందులు

అధికారుల తనిఖీలో బహిర్గతం

దామరచర్ల, న్యూస్‌టుడే: ఏపీలోని గుంటూరు కేంద్రంగా పేరొందిన కంపెనీల పేరుతో తెలంగాణలో నకిలీ పురుగు మందుల సరఫరా జరుగుతున్నట్లు వ్యవసాయాధికారుల విచారణలో వెల్లడైంది. నల్గొండ జిల్లాలోని మిర్యాలగూడతో పాటు దామరచర్ల, అడవిదేవులపల్లి తదితర మండలాల పరిధిలో బ్రాండెడ్ కంపెనీ పేరుతో నకిలీవి రైతులకు విక్రయిస్తున్నారు. దీనిపై ప్రముఖ సంస్థ కంపెనీ ప్రతినిధులు రెండ్రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం మొదట మిర్యాలగూడలోని ఓ ఫర్టిలైజర్స్, సీడ్స్ దుకాణంలో తనిఖీ చేయగా ప్రముఖ కంపెనీ పేరుతో గల నకిలీ పురుగు మందులు ఉన్నట్లు గుర్తించారు. రూ.52,900 విలువైన 11 కిలోల బరువుగల 23 సాచెట్లను స్వాధీనం చేసుకున్నారు. దుకాణదారుడిని ప్రశ్నించగా. ఓ వ్యక్తి మధ్యవర్తిగా వ్యవహరించి డీలర్ నుంచి సరకు తమకు అందినట్లు తెలిపారు. సమాచారం ప్రకారం మండలంలోని వీర్లపాలెంలోని ఆగ్రోస్‌రైతు సేవా కేంద్రాన్ని అధికారులు తనిఖీ చేయగా అక్కడా నకిలీవి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. గుంటూరు నుంచి ధనావత్ రమేష్ ఈ ప్రాంతంలోని పలు దుకాణాలకు నకిలీ మందులు సరఫరా చేస్తున్నట్లు ఓ దుకాణ యజమాని వివరించారు.

★ డీఏవో మాట్లాడుతూ.. నకిలీవి విక్రయిస్తున్న దుకాణదారుల అనుమతులను రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వీటిపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కంపెనీలకు సంబంధించిన ఇన్వాయిస్‌లను రైతులకు చూపించాలని, కొనుగోలు బిల్లులు అందించాలని ఆదేశించారు. అక్రమాలకు పాల్పడుతున్న దుకాణదారులపై చర్యలు తీసుకోవాలని వాడపల్లి పోలీస్‌స్టేషన్‌లో వ్యవసాయాధికారులు ఫిర్యాదు చేశారు. ఏడీఏ దేవ్‌సింగ్, ఏవో సైదానాయక్ తదితరులున్నారు.

300 బస్తాల చౌక బియ్యం నూకలు స్వాధీనం



ఆటోను సీజ్ చేసిన పోలీసులు

కొల్లిపర, న్యూస్‌టుడే: మండలంలోని అత్తోటలో గురువారం అక్రమంగా చౌక బియ్యం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు కొల్లిపర ఎస్ఐ పి.కోటేశ్వరరావు, సిబ్బంది గ్రామానికి చేరుకొని ఆటోను అదుపులోకి తీసుకుని పరిశీలించారు. గోతాల్లో నూకలు ఉన్నట్టు గుర్తించి సరుకు తీసుకున్న గోదామును తనిఖీ చేయగా.. 300 నూకల మూటలున్నాయి. పోలీసుల సమాచారం మేరకు సివిల్ సప్లయిస్ రెవెన్యూ ఇన్‌స్పెక్టరు జాన్ అక్కడి నిల్వలను పరిశీలించి చౌకబియ్యం నూకలుగా మార్చినట్టు గుర్తించారు. గోదాము యజమాని సింగంశెట్టి శంకరరావు నుంచి వివరాలు తీసుకున్నారు. నమూనాలను ల్యాబ్‌కు పంపిస్తామని, రిపోర్టులు వచ్చిన తరవాత తదుపరి చర్యలు చేపడతామని అధికారులు పేర్కొన్నారు. నూకలమూటలు తరలిస్తున్న తన్నీరు శ్రీనివాసరావును అదుపులోకి తీసుకున్నామని. ఆటోను, నూకలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషనుకు తరలించామని ఎస్ఐ చెప్పారు. ఏఎస్ఐ పోతురాజు, నాగబాబు, వీఆర్వో బాషా పాల్గొన్నారు.

మంగళగిరి
• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

'ప్రజాదర్బార్'లో వినతుల వెల్లువ


మంత్రి నారా లోకేశ్‌కు వినతిపత్రం అందిస్తున్న బాధితులు

తాడేపల్లి, న్యూస్‌టుడే : మండలంలోని ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేశ్ గురువారం నిర్వహించిన 43వ 'ప్రజాదర్బార్'లో పలువురు వినతిపత్రాలు అందజేశారు. కారు చోదకుడిగా పని చేస్తున్న తన కుమారుడిని తోటి డ్రైవర్లు కలసి హతమార్చారని విచారించి నిందితులను శిక్షించాలని ఉండవల్లికి చెందిన ఏపూరి వెంకట రమణ కోరారు. కుటుంబానికి ఆధారమైన కొడుకుని కోల్పోవడం వల్ల తాను అనారోగ్యానికి గురైనట్లు మంత్రికి వివరించారు. పింఛను మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. అమరావతి రాజధాని పరిధిలో గత 50 ఏళ్లుగా వ్యవసాయ కూలీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్న తమకు గత ప్రభుత్వం రాజధాని రైతు కూలీ పెన్షన్ నిలిపేసిందని తిరిగి పునరుద్ధరించాలని ఉండవల్లికి చెందిన పెయ్యాల శ్రీరామమూర్తి, భూపతి రాజు సత్యన్నారాయణ రాజు మంత్రికి విన్నవించారు. అనారోగ్యంతో భర్త మృతి చెందడంతో ఇద్దరు పిల్లల పోషణ భారంగా మారిందని నులకపేటకు చెందిన కొండా సుశీల వినతిపత్రం అందజేశారు. తనకు ఇంటిని మంజూరు చేసి ఉపాధి కల్పించి ఆదుకోవాలన్నారు. అమరావతి నిర్మాణానికి ల్యాండ్ పూలింగ్‌నకు సేకరించిన తమ భూమికి వార్షిక కౌలు అందడం లేదని విచారించి కౌలు మంజూరు చేయాలని మంగళగిరి మండలం నిడమర్రుకు చెందిన చల్లా పెద్ద అంకమరావు కోరారు. డిగ్రీ వరకు చదువుకున్న తనకు ఎయిమ్స్‌లో ఉద్యోగం ఇప్పించాలని మంగళగిరికి చెందిన షేక్ మహ్మద్ రఫీ మంత్రి లోకేశ్‌కి వినతిపత్రం అందజేశారు.

పెళ్లికానుక అందజేత



స్థానిక సాయినగర్‌కు చెందిన నాగ వెంకట సాయి ప్రసాద్, నవీనా దంపతులకు మంత్రి నారా లోకేశ్ గురువారం నూతన వస్త్రాలను పంపించారు. తెదేపా బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయరావు, ఆ పార్టీ నాయకులు బిట్రా నాగరాజు, పొట్లాబత్తుని నరసింహారావు, మునగాల మురళీ సంయుక్తంగా నూతన వధూవరులకు వాటిని అందజేశారు. - **న్యూస్‌టుడే, మంగళగిరి**

అధ్వానం.. అపరిశుభ్రం..!

రాజధాని ముఖ ద్వారం ఉండవల్లిలో ఇదీ పరిస్థితి

ఉండవల్లి (తాడేపల్లి), న్యూస్‌టుడే

రాజధాని ముఖ ద్వారమైన ఉండవల్లి సమస్యలతో సతమతమవుతోంది. దాదాపుగా 15 వేల మంది జనాభా నివసిస్తున్న గ్రామంలో తాగునీరు, పారిశుద్ధ్యం అధ్వానంగా మారడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. నిన్నా మొన్నటి వరకు మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో విలీనమై ఉన్న మేజర్ పంచాయతీ ఉండవల్లి. తాజాగా ఆ గ్రామాన్ని నగరపాలక సంస్థ నుంచి సీఆర్డీఏకి తీసుకున్నారు. విజయవాడకు సమీపంలో ఉన్న గ్రామం కావడంతో నిత్యం వేలాది మంది ఇటువైపుగా రాకపోకలు సాగిస్తుంటారు. రాష్ట్రం నలుమూలల నుంచి వివిధ పనులపై రాజధానికి వచ్చేవారు ఉండవల్లి కూడలిని దాటుకొని వెళ్తారు. అంతటి ప్రాధాన్యం కలిగిన గ్రామంలో ప్రధాన రహదారిపై ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా తయారైంది. ఇటీవల ఇద్దరు దంపతులు ద్విచక్ర వాహనంపై వెళ్తు వాహనం గుంతలోకి దిగి అదుపుతప్పి పడిపోవడంతో భార్యకు గాయాలయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


ఉండవల్లి కూడలిలో రోడ్డుపై ఏర్పడిన గుంత


పోలకంపాడులో ప్రధాన రహదారి పక్కనే రోజుల తరబడి నిల్వ ఉన్న మురుగు

పేరుకుపోతున్న వ్యర్థాలు..


చెత్తడబ్బాలో తొలగని వ్యర్థాలు

ఉండవల్లిలో చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. ముఖ్యంగా ఉండవల్లి కూడలిలో వాణిజ్య సముదాయాలు ఎక్కువగా ఉండటంతో ఈ సమస్య జటిలంగా మారింది. రోడ్డుపైనే చెత్త డబ్బాలు ఏర్పాటు చేయడం వల్ల దుర్వాసన వెదజల్లి ప్రజల రాకపోకలకు అసౌకర్యంగా మారింది. ఇంటింటా చెత్త సేకరణలో కావాల్సినంత సిబ్బంది లేకపోవడంతో తడి, పొడి చెత్తను గృహ యజమానులు క్యారీ బ్యాగుల్లో తెచ్చి రోడ్డుపైనే వదిలేస్తున్నారు. దీనివల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీ ఇంటి నుంచి క్రమం తప్పకుండా పుష్‌కాట్‌లు ద్వారా చెత్త సేకరణ చేయాలని స్థానికులు కోరుతున్నారు. చెత్త సేకరించే ఆటోలు కూడా రావడం లేదని దీనివల్ల ఇంట్లో చెత్తను నిల్వ చేయలేక పోతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మురుగు పారుదల లేక...

గ్రామంలోని డ్రెయిన్లలో పూడిక తీయక పోవడంతో ఎక్కడ మురుగు అక్కడ నిలిచి దుర్వాసన వెదజల్లుతోందని గ్రామస్థులు వాపోతున్నారు. మురుగు నిల్వ వల్ల దోమలు పెరుగుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. కనీసం వాటి నివారణకు ఫాగింగ్ కూడా నిర్వహించకపోవడంతో చీకటి పడితే దోమలు పీక్కుతింటున్నాయని వివరించారు. నివాస గృహాల మధ్యనున్న ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చిమొక్కలు వల్ల విష కీటకాలు వస్తాయని భయాందోళనకు గురవుతున్నారు. కనీసం వారానికి ఒకరోజైనా కాలువల్లో పూడిక తీస్తే మురుగు నిల్వ ఉండే పరిస్థితి ఉండదని అభిప్రాయ పడ్డారు. ఆయా సమస్యలపై సీఆర్డీఏ, నగరపాలక సంస్థ ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కాబోయే వధూవరులను ఆశీర్వదించిన మంత్రి


వినోద్‌కుమార్, కావ్యలకు బహుమతి అందిస్తున్న మంత్రి లోకేశ్ దంపతులు

మంగళగిరి, న్యూస్‌టుడే : మండలంలోని ఆత్మకూరు వద్దనున్న సీకే కన్వెన్షన్‌లో గురువారం జరిగిన తెలుగు యువత పట్టణ అధ్యక్షుడు బోగి వినోద్‌కుమార్ నిశ్చితార్థానికి మంత్రి నారా లోకేశ్, బ్రాహ్మణి దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్, కావ్యలను ఆశీర్వదించారు. జనసేన, వివిధ రాజకీయ పక్షాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి


మంగళగిరిలో..


సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి లోకేశ్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న బోయ వాల్మీకి ప్రతినిధులు

మంగళగిరి, న్యూస్‌టుడే : మంగళగిరి, తాడేపల్లిలో వాల్మీకి మహర్షి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ అలీంబాషా సిబ్బందితో కలిసి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మంగళగిరి, న్యూస్‌టుడే : శ్రీరాముని చరిత్రను అందించిన వాల్మీకి మహర్షి జయంతిని రాష్ట్ర పండగగా ప్రభుత్వం ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఫ్లెక్సీలకు బోయి వాల్మీకి యూత్ ఆధ్వర్యాన క్షీరాభిషేకం చేశారు.


ప్రత్తిపాడులో..

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే : పవిత్రమైన రామాయణం గ్రంథాన్ని రచించిన గొప్ప మహర్షి వాల్మీకి అని ఎంపీడీవో కె.శివపార్వతి అన్నారు. ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కూటమి ప్రభుత్వంతో పల్లెల ప్రగతి

తుళ్లూరు, న్యూస్‌టుడే : గ్రామాల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని, అది 'పల్లె పండగ' కార్యక్రమంతో రుజువవుతోందని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని పెదపరిమి, వడ్డమాను, హరిశ్చంద్రపురం గ్రామాల్లో జరిగిన కార్యక్రమానికి ఆయన హాజరై పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ చేశారు.

ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే : తాడికొండ నియోజకవర్గంలో మొదటి దశలో మొత్తం రూ.3 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ తెలిపారు. 'పల్లె పండగ' కార్యక్రమంలో భాగంగా వేములూరిపాడు, ఫిరంగిపురం, కండ్రిక, యర్రగుంట్లపాడులో సీసీ రహదారుల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ప్రజలతో మాట్లాడి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. ఫిరంగిపురంలో ఎమ్మెల్యేను గుర్రంపై ఊరేగింపుగా తీసుకెళ్లారు.


పెదపరిమిలో భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్


అనంతవరప్పాడులో

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే : మండలంలోని అనంతవరప్పాడులో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన 'పల్లె పండగ' కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి వెంకటరావు రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

దుగ్గిరాల, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పని చేస్తోందని ఎంపీపీ షేక్ జబీన్, తెదేపా మండల అధ్యక్షులు కేసంనేని శ్రీనిత అన్నారు. రేవేంద్రపాడు, చిలువూరు, తుమ్మపూడిలో జరిగిన 'పల్లె పండగ' కార్యక్రమంలో వారు మాట్లాడారు.


దుగ్గిరాల: చిలువూరులో..

తల్లి పేరు మీద ఒక మొక్క


పాఠశాలలో మొక్క నాటుతున్న అజయ్‌బాబు, ఉపాధ్యాయులు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే : తల్లి పేరుతో ప్రతి ఒక్కరూ మొక్క నాటాలని ఎస్‌బీఐ ప్రత్తిపాడు శాఖ మేనేజరు ఆర్.అజయ్‌బాబు చెప్పారు. గురువారం ఎస్‌బీఐ ఆధ్వర్యంలో 'తల్లి పేరు మీద ఒక చెట్టు' కార్యక్రమంలో భాగంగా స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో బ్యాంకు అధికారులు, సిబ్బంది మొక్కలు నాటారు. హెచ్‌ఎం శ్రీనివాస్, ఆదిశేషు, రామచంద్ర, శ్రీధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్త్రీ నిధి.. భవితకు పెన్నిధి

✤ స్వయం సంఘాలకు ప్రభుత్వం చేయూత ✤ ఫుడ్ ప్రాసెసింగ్ వ్యాపారానికి తక్కువ వడ్డీకే రుణాలు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే

గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఆదరణ కోల్పోయిన డ్వాక్రా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మహిళలను లక్షాధికారులను చేస్తామని ఆర్భాటంగా ప్రకటించిన వైకాపా ప్రభుత్వం రుణాలు మంజూరు చేసే అవకాశాలపై దృష్టి పెట్టలేదు. డ్వాక్రా సంఘాల బలోపేతంపై నిర్లక్ష్యం చూపింది. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 4 నెలల కాలంలోనే ప్రత్యేక చర్యలు చేపట్టింది. డ్వాక్రా సంఘాలలో ఉంటూ ఫుడ్ ప్రాసెసింగ్ బిజినెస్‌లో ఉన్న మహిళలకు జీవనోపాధి మెరుగు పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న పీఎంఎఫ్‌ఎంఈ కార్యక్రమాన్ని మహిళల ఆదాయాన్ని పెంచేందుకు అనుసంధానం చేస్తోంది. ఈ ఏడాదిలో ఫుడ్ ప్రాసెసింగ్ వ్యాపారంలో ఉన్న వారికి ఒక్కో మహిళకు రూ.40 వేల చొప్పున రుణంగా ఇచ్చేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. ప్రత్తిపాడు, గ్రామీణ గుంటూరు, వట్టిచెరుకూరు, పెదనందిపాడు, కాకుమాను మండలాల్లో ఈ వ్యాపారంలో ఉన్న పొదుపు సంఘాల సభ్యులను ఎంపిక చేసి 6శాతం వడ్డీకి రుణాన్ని ఇవ్వనున్నారు. డ్వాక్రా మహిళలు బ్యాంకు లింకేజీ ద్వారా తీసుకునే రుణానికి 9 శాతం నుంచి 13.50 శాతం వరకు వడ్డీ చెల్లిస్తున్నారు. స్త్రీనిధి సంస్థ ద్వారా 11 శాతంతో రుణం ఇస్తోంది. అయితే ఈ పీఎంఎఫ్‌ఎంఈ కింద ఎంపిక చేసిన మహిళలకు వారి వ్యాపారాన్ని మరింత పెంచుకునేందుకు ఇదే సంస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం 6 శాతం వడ్డీకే రూ.40 వేల రుణాన్ని అందించనుంది. తీసుకున్న రుణాన్ని రెండేళ్ల కాల వ్యవధిలో చెల్లిస్తే మరింత ఎక్కువగా రుణాన్ని తక్కువ వడ్డీకే ఇచ్చేందుకు చర్యలు చేపట్టారు. స్త్రీనిధి సంస్థ జిల్లా మేనేజరు హర్షవర్ధన్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా, వ్యాపార యూనిట్లు ఉన్న మహిళలను ఎంపిక చేసి రుణం ఇవ్వనున్నట్లు చెప్పారు.



మండలం	సంఘాలు	సభ్యులు
ప్రత్తిపాడు	1246	12460
గ్రామీణ గుంటూరు	760	7600
కాకుమాను	1048	10480
పెదనందిపాడు	990	9900
వట్టిచెరుకూరు	1174	11740

హుండీ ఆదాయం లెక్కింపు


కానుకలు లెక్కిస్తున్న మహిళలు

దుగ్గిరాల, న్యూస్‌టుడే : కంఠంరాజుకొండూరు మహంకాళి అమ్మవారి ఆలయంలో హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. నాలుగు నెలలకు గాను రూ.15,81,924 వచ్చినట్లు ఈవో సునీల్‌కుమార్ తెలిపారు. ఇది గత ఆదాయం కంటే రూ.3,71,457 ఎక్కువగా వచ్చిందని చెప్పారు. దేవాదాయ శాఖ అధికారి సీహెచ్ వెంకట శ్రీనివాసులు, వంశపారంపర్య ధర్మకర్త దేవభక్తుని రంగప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించండి

మంగళగిరి, న్యూస్‌టుడే : క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్స్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యాన ఆందోళన చేపట్టారు. కార్పొరేషన్ పరిధిలో 64 మంది క్లాప్ ఆటోడ్రైవర్లు పని చేస్తున్నారని, వారికి మూడు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని వాపోయారు. కార్పొరేషన్‌లో పని చేసే పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు పెరిగినప్పటికీ తమకు మాత్రం జీతాలు పెంచలేదని ఆరోపించారు. నాయకులు ఎస్ఎస్ చంగయ్య, శివ, రవి తదితరులు పాల్గొన్నారు.

? ముట్లూరులో విద్యుత్తు కోత ఎక్కువగా ఉంది. ముందుగా ప్రకటించకుండానే సరఫరా నిలిపేస్తున్నారు. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. **- మార్తమ్మ, గ్రామస్థురాలు**

? అనంతవరప్పాడు, వట్టిచెరుకూరు, గారపాడు గ్రామాల్లో దీర్ఘ కాలం నుంచి ఉన్న విద్యుత్తు స్తంభాలు వర్షాలకు కూలిపోతున్నాయి. వాటిని తొలగించి కొత్తవి ఏర్పాటు చేయండి. **- శ్రీదేవి, గారపాడు**

✔ ప్రతి శనివారం విద్యుత్తు లైన్లకు మరమ్మతులు చేస్తున్నాం. వినియోగదారులకు అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకుంటాం. **-రవితేజ, ఏఈ, విద్యుత్తు శాఖ**
- న్యూస్‌టుడే, వట్టిచెరుకూరు

? మండలంలోని ఐనవోలులో మురుగు కాలువల్లో పూడిక తీయించాలి. **- రామారావు, రైతు**

✔ పారిశుద్ధ్య కార్మికులతో కాలువలను శుభ్రం చేయిస్తాం. **- సాంబిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి, ఐనవోలు -న్యూస్‌టుడే, తుళ్లూరు**

? పెదనందిపాడు 1వ వార్డులో సీసీ రోడ్డుపై వర్షపు నీరు నిలిచి రాకపోకలకు అసౌకర్యంగా మారింది. **-గ్రామస్థులు**

✔ రహదారి మరమ్మతులకు చర్యలు తీసుకుని ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేస్తాం. **నాగయ్య, ఇన్‌ఛార్జి కార్యదర్శి**
-న్యూస్‌టుడే, పెదనందిపాడు

? ప్రత్తిపాడులో తహసీల్దారు కార్యాలయం ఎదురు, ఎస్సీ బాలికల వసతి గృహం నివాసాలకు వెళ్లే దారి పక్కన వ్యర్థాలు పేరుకున్నాయి. **- స్థానికులు**

✔ పారిశుద్ధ్య కార్మికులను పంపి చెత్తను వెంటనే తొలగింపజేస్తాం. **-షేక్.ఖాజా, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి**
– న్యూస్‌టుడే, ప్రత్తిపాడు

మద్యం దుకాణాలు ఊరికి దూరంగా పెట్టాలి


తహసీల్దారు కల్యాణికి వినతి పత్రం అందిస్తున్న సిరిపురం వాసులు

మేడికొండూరు, న్యూస్‌టుడే : మండలంలోని సిరిపురానికి చెందిన నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సేవా సంఘం సభ్యులు తహసీల్దారు కల్యాణి, పోలీసులకు గురువారం వినతి పత్రం అందించారు. గ్రామంలోని చెరువు కట్ట వద్ద ఎంతోమంది ఇళ్లు కట్టుకుని నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో నివాసాల మధ్యలో రెండు మద్యం దుకాణాలు పెట్టాలని ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీంతో మహిళలు, పిల్లలు ఇబ్బంది పడాల్సి వస్తుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఆ దుకాణాలు ఊరికి దూరంగా ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సీఎం సహాయనిధికి రూ.2.50 లక్షలు విరాళం


మంత్రి లోకేశ్‌కు చెక్కు అందిస్తున్న వెంకట్రావు, వాసు

దుగ్గిరాల, న్యూస్‌టుడే : దుగ్గిరాల వన్ సేవా ట్రస్ట్(దోస్త్) తరపున ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.2.50 లక్షలు విరాళం ఇచ్చారు. మంత్రి నారా లోకేశ్‌ను తెదేపా నాయకులు, దోస్త్ సభ్యులు గూడూరు వెంకట్రావ్, గద్దె వాసు ఉండవల్లిలో గురువారం కలిసి దీనికి సంబంధించిన చెక్కును అందించారు.

దాతల వితరణ అభినందనీయం


చాకోస్ అందుకున్న విద్యార్థినులు

దుగ్గిరాల, న్యూస్‌టుడే : దాతల వితరణ అందిపుచ్చుకొని బాలికలు శారీరకంగా, మానసికంగా దృఢం కావాలని స్థానిక చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ కృష్ణమూర్తి, ప్రధానోపాధ్యాయిని శోభాదేవి అన్నారు. గురువారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలోని 500 మంది విద్యార్థినులకు జాగృత భారత ట్రస్ట్ తరపున పసుపులేటి గణేష్ కెలాక్సీ చాకోస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలికలకు మైండ్‌గేమ్, ఇతర పోటీలు నిర్వహించారు.

తహసీల్దారుగా బాధ్యతల స్వీకరణ


కరుణ్ కుమార్

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే : ప్రత్తిపాడు తహసీల్దారుగా జి.కరుణ్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో సాధారణ బదిలీపై ఇక్కడకు వచ్చిన కె.రవిబాబును డిప్యూటేషన్‌పై సీఆర్‌డీఏకు కొద్దిరోజుల కిందట ప్రభుత్వం పంపింది. తాజాగా కరుణ్ కుమార్‌ను కలెక్టరు కె.నాగలక్ష్మి నియమించడంతో పల్నాడు జిల్లా రెంటచింతల నుంచి కరుణ్ కుమార్ ఇక్కడకు వచ్చారు.

స్వర్ణకారుల కలలు సాకారం చేసినందుకు కృతజ్ఞతలు

మంగళగిరి, న్యూస్‌టుడే : స్వర్ణకారుల చిరకాల స్వప్నాన్ని మంత్రి నారా లోకేశ్ నిజం చేసినందుకు జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం మంగళగిరి బైపాస్ రోడ్డులోని పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో స్వర్ణకారులకు ఆదరణ లేక అనేక మంది ఆత్మహత్యలు చేసుకున్నారని, కొంత మంది వృత్తిని వదిలి వెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో వారికి తాను అండగా ఉన్నానంటూ మంత్రి నారా లోకేశ్ స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.

పాఠశాలలో పౌష్టికాహార దినోత్సవం

మంగళగిరి, న్యూస్‌టుడే : మండలంలోని ఆత్మకూరు నిర్మలా పాఠశాలలో పౌష్టికాహార దినోత్సవ వేడుకలను కరస్పాండెంట్ సిస్టర్ జాన్‌పాల్, ప్రధానోపాధ్యాయులు జ్ఞాన సౌందరి గురువారం ప్రారంభించారు. విద్యార్థులు వివిధ రకాల సహజ సిద్ధమైన పండ్లు, చిరుధాన్యాలు, విటమిన్స్, ప్రొటీన్లు, మినరల్స్, కార్బొహైడ్రేట్ కలిగిన పదార్థాలను తయారు చేసి ప్రదర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా మహాసభ ఆవిర్భావ వేడుకలు

మేడికొండూరు, న్యూస్‌టుడే : మండల కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ 12వ మహాసభ ఆవిర్భావ వేడుకలు జరిగాయి. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు అప్పారావు మాట్లాడుతూ.. పేదల కోసం పార్టీ ఎన్నో పోరాటాలు చేసిందని తెలిపారు. అనంతరం ఈ నెల 21న గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే రాజకీయ పరిణామాలకు సంబంధించి కరపత్రాలు పంపిణీ చేశారు.

అర్చకులకు నోటీసులు

పెదకాకాని, న్యూస్‌టుడే: పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలోని అర్చకులపై స్థానిక భక్తుడు పెండ్యాల నాగసురేష్ ఈవో గోగినేని లీలాకుమార్‌కి ఫిర్యాదు చేశారు. ఈ నెల 14వ తేదీన స్వామికి అభిషేక పూజలు నిర్వహించేందుకు ఆలయానికి వెళ్లగా.. ఆ సమయంలో శాశ్వత ప్రాతిపదికన విధులు నిర్వహించే అర్చకులు లేకపోవడం, వారి సహాయక అర్చకులు అభిషేక పూజలు నిర్వహించారని ఆరోపిస్తూ ఆయన ఈ నెల 15కాయన ఈవో ఫిర్యాదు చేయగా.. ఈవో స్పందించి అదే రోజు అర్చకులందరికీ నోటీసులు ఇచ్చారు.

టవర్ కేంద్రంలో బ్యాటరీలు చోరీ

పెదకూరపాడు, న్యూస్‌టుడే : సెల్‌టవర్ కేంద్రంలో బ్యాటరీలు చోరీ చేసిన దొంగలను గంటల వ్యవధిలో పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై గిరిబాబు తెలిపిన వివరాల మేరకు.. పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం జలాల్‌పురంలోని ఎయిర్‌టెల్ టవర్‌లోని 24 బ్యాటరీలను బుధవారం తెల్లవారుజామున దొంగలు చోరీ చేశారు. సెల్‌టవర్ కంపెనీ సూపర్‌వైజర్ బాజీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. విలాసాలకు అలవాటు పడి దొంగతనలు చేస్తున్న గుంటూరు నగరానికి చెందిన దడిగి మణికంఠ, పెదనందిపాడు మండలంలోని పుసులూరుకు చెందిన బిల్లా వెంకటేశ్, దక్కుమల్ల ధనరాజును గురువారం అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను సత్తెనపల్లి కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల పాటు రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

బాలిక అదృశ్యంపై కేసు

మేడికొండూరు, న్యూస్‌టుడే : బాలిక అదృశ్యమైన ఘటనపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఒక గ్రామానికి చెందిన బాలిక ఇంటర్ వరకు చదువుకొని కొన్నాళ్లుగా ఇంటి వద్దే ఉంటుంది. గురువారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వచ్చింది. అప్పటి నుంచి కనిపించడం లేదు. ఎంత వెతికినా ఆచూకీ లేదని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మేడికొండూరు పోలీసులు తెలిపారు.

యోబు సేవలు మరువలేం: వీసీ

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఉద్యోగిగా, ఉద్యోగ సంఘం నాయకుడిగా నంబూరు యోబు విశేష కృషి చేశారని ఏఎన్‌యూ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ చెప్పారు. ఏఎన్‌యూలో గురువారం ఏసీ ఈగా పనిచేస్తూ మృతిచెందిన యోబు సంతాప సభ నిర్వహించారు. యోబు చిత్రపటానికి పూలమాల వేసి అంజలి సమర్పించారు. వీసీ ఆచార్య గంగాధర్ మాట్లాడుతూ ఉద్యోగ సమస్యల కోసం నిరంతం పోరాడారని చెప్పారు. విశ్వవిద్యాలయం అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. రెక్టార్ ఆచార్య రత్నషీలామణి మాట్లాడుతూ యోబు కుటుంబానికి ఏఎన్‌యూ అండగా ఉంటుందన్నారు.

తెనాలి

• తెనాలి • పొన్నూరు

యోబు సేవలు మరువలేం: వీసీ

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఉద్యోగిగా, ఉద్యోగ సంఘం నాయకుడిగా నంబూరు యోబు విశేష కృషి చేశారని ఏఎన్‌యూ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ చెప్పారు. ఏఎన్‌యూలో గురువారం ఏసీఈగా పని చేస్తూ మృతిచెందిన యోబు సంతాప సభ నిర్వహించారు. యోబు చిత్రపటానికి పూలమాల వేసి అంజలి సమర్పించారు. వీసీ ఆచార్య గంగాధర్ మాట్లాడుతూ ఉద్యోగ సమస్యల కోసం నిరంతం పోరాడారని చెప్పారు. విశ్వవిద్యాలయం అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. రెక్టార్ ఆచార్య రత్నషీలామణి మాట్లాడుతూ యోబు కుటుంబానికి ఏఎన్‌యూ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, ఆచార్య రత్నాకర్, వికాస ప్రధాన కార్యదర్శి కావూరి శ్రీనివాసరావు, నేలపాటి నాగేశ్వరరావు, నూతక్కి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కళాశాలలో సహాయ ప్రిన్సిపాళ్ల నియామకం

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాలకు ఇద్దరు సహాయ ప్రిన్సిపాళ్లను నియమించారు. మెకానికల్ విభాగం అధ్యాపకులు డాక్టర్ గోపికృష్ణ, డాక్టర్ చంద్రమౌళిలను సహాయ ప్రిన్సిపాళ్లగా నియమిస్తూ రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం ఉత్తర్వులు జారీ చేశారు. వీరికి గురువారం ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆచార్య గంగాధర్ నియామక పత్రాలు అందజేశారు. గోపికృష్ణకు పరిపాలన బాధ్యతలు, చంద్రమౌళికి విద్యాపరమైన బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? పట్టణంలోని 15వ వార్డులో రహదారిపై పడిన గొయ్యి ప్రమాదకరంగా ఉంది. **-కె.ప్రదీప్‌కుమార్**

✔ మరమ్మతులు చేయిస్తాం. **-అపర్ణ, సహాయ ఇంజినీర్**

? బాలాజీనగర్‌లో ఖాళీ స్థలంలో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. విషసర్పాలు వస్తున్నాయి. **-ఎ.శ్రీలక్ష్మి, బాలాజీనగర్**

✔ స్థల యజమానులకు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటా. **-శ్రీనివాసరావు, ప్రజారోగ్యశాఖాధికారి**

-న్యూస్‌టుడే, పొన్నూరు

? తెనాలిలో ఎటు చూసినా ఫ్లెక్సీలే కనిపిస్తున్నాయి. రోడ్ల వెంబడి, డివైడర్లపై రాకపోకలకు అడ్డుగా ఉంటున్నాయి. గంగానమ్మపేటలో శబ్ద కాలుష్యం చాలా తీవ్రంగా ఉంది. పిల్లలు, పెద్దలు అందరూ ఇబ్బంది పడుతున్నారు. **-స్థానికులు**

✔ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- బి.శేషన్న, మున్సిపల్ కమిషనర్.** –న్యూస్‌టుడే, తెనాలి టౌన్

స్పందనకు వందనం

వీధి దీపాలు వెలిగాయి: మారీసుపేటలో వీధి దీపాలు వెలగటం లేదని స్థానికులు 'ఈనాడు' ద్వారా ఈ నెల 16న మున్సిపల్ అధికారులకు తెలియచేయగా సమస్య పరిష్కారం అయింది.

వ్యర్థాల తొలగింపు : మేమున్నాం... మీకు తోడుగా శీర్షిక ఈనాడులో ప్రచురితమైన కథనానికి ప్రజారోగ్యశాఖాధికారులు స్పందించారు. రైలుపేటలో మురుగు కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు.

– న్యూస్‌టుడే, తెనాలి టౌన్, పొన్నూరు

తాగునీరు కలుషితం..
అంటువ్యాధుల భయం

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే

అధికారులు పట్టించుకోకపోవడంతో పట్టణ పరిధి పినపాడు, పాండురంగపేట వాసులు సమస్యలతో అవస్థలు పడుతున్నారు. పినపాడు-రేపల్లె రైలు గేటు వద్ద ఆర్వోబీ నిర్మాణం చేపట్టక ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వస్తుందని వాహనచోదకులు వాపోతున్నారు. ఎన్నికల సందర్భంగా అభ్యర్థులు ఆర్వోబీ నిర్మిస్తామని ఇచ్చిన హామీ మాటలకే పరిమితమైంది. మారీసుపేట నుంచి పినపాడుకు వెళ్లే పంట కాలువలోకి వ్యర్థాలు వేయడం, మురుగు, మరుగుదొడ్ల వ్యర్థాలు వదలడం పరిపాటి అయింది. స్థానిక చెరువులోకి వ్యర్థాలు వదులుతున్నట్లు స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

వార్డులు	:	25,26,27
కుటుంబాలు	:	2,930
జనాభా	:	10,250


మురుగు నీటిలో కుళాయి

✤ పినపాడులో సీసీ రోడ్డు వేసి కాలువలు నిర్మించకుండా వదిలేయడంతో మురుగు ముందుకు కదలక దుర్గంధం వ్యాపిస్తోంది. పైపులు మురుగునీటిలో ఉండడంతో తాగునీరు కలుషితమవుతుందని జనం భయాందోళన చెందుతున్నారు. పూర్తిగా గుంతలు పడిన పినపాడు నుంచి సుందరయ్యనగర్ వెళ్లే ఆర్ అండ్ బీ రోడ్డులో మరమ్మతు పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. పట్టణంలో ఇంటింటి నుంచి సేకరించేందుకు గత వైకాపా ప్రభుత్వ హయాంలో చేపట్టిన గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ నిర్మాణ పనులు నిలిచాయి. ఇందులో వాడిన ఇనుము వానకు తడిసి తుప్పు పడుతుందని, పనులు పునరుద్ధరించాల్సి ఉంది. పినపాడు మసీదు సమీపంలోని పక్కా కాలువలో మురుగు పొంగి రోడ్ల పైకి వస్తున్నాయని, వీటిలో నుంచి రాకపోకలు సాగించలేక ఇబ్బంది పడుతున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

✤ పాండురంగపేట శ్మశాన వాటిక ఎదురు రోడ్డు పైన సిమెంటు తొలగిపోయి బయట పడిన కంకర మీద రాకపోకలకు చాలా ఇబ్బంది పడుతున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. వీధి కుక్కలు వెంట పడి భయపెడుతున్నాయని జనం ఆందోళన చెందుతున్నారు. కాలువలు క్రమం తప్పకుండా శుభ్రం చేయటంలేదని, అపార్ట్‌మెంట్లలో చెత్త తీసుకెళ్లడానికి వందల్లో నగదు డిమాండ్ చేస్తున్నట్లు వాపోయారు. ఎన్టీఆర్ రోడ్డులోని మరుగుదొడ్లను రసాయనాలతో శుభ్రం చేయక దుర్వాసన వ్యాపిస్తుందని, అంటువ్యాధులు ప్రబలుతున్నట్లు జనం ఆందోళన చెందుతున్నారు.

తాగునీటి కుళాయిలు కనెక్షన్లు ఉచితంగా ఇవ్వాలి



పాలకులు ఇంటింటికి తాగునీటి కుళాయిలు ఉచితంగా ఇస్తామని ప్రకటించారు. మున్సిపల్ అధికారులు మాత్రం ఉచితం కాదంటున్నారు. ఈ విషయమై పాలకులు పట్టించుకోవాలి

- సుధాకరరావు,వ్యాపారి, చెంచుపేట

వీధి దీపాలు ఉన్నా ఉపయోగంలేదు



రోడ్ల పక్క వీధి దీపాలను చెట్లకొమ్మలు కమ్మేసి వెలుతురు కనిపించక చీకట్లు అలముకున్నాయి. వాటిని నరికించాలని మున్సిపల్ అధికారులను కోరినా పట్టించుకోవడంలేదు. వీధి దీపాలు వెలుగుతున్నా ఉపయోగం లేకుండా ఉంది. చిన్న పాటి వర్షానికే కార్ల అంజయ్య రోడ్డు నీట మునుగుతుంది.

- జి.రాజేంద్రప్రసాద్, రైతు, పాండురంగపేట

మౌలిక వసతులు కరవు

✤ ఇబ్బందులు పడుతున్న కాలనీ వాసులు

పొన్నూరు, న్యూస్‌టుడే: గత వైకాపా పాలనలో పట్టణంలో మౌలిక వసతులు కొరవడటంతో పుర ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాలనీ ప్రజలు ప్రధానంగా మూడు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ పరిధి నేతాజీనగర్‌లో మురుగు పోయేందుకు అధికారులు లక్షలాది రూపాయలు ఖర్చు చేసి సిమెంటు మురుగు కాలువలు నిర్మించారు. కాలనీలోని కొన్ని ప్రాంతాల్లో మురుగు కాలువలు పూడిపోయాయి. కాలువలు పూడిపోవడంతో మురుగు ముందుకు కదలక పోవడంతో స్థానికులు దోమల సమస్యతో అల్లాడుతున్నారు.


విద్యానగర్‌లో ప్రమాదకరంగా వంతెన


నేతాజీనగర్‌లో పూడిపోయిన కాలువ

✤ శ్రీనగర్ కాలనీ, విద్యానగర్ ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు దట్టంగా మొలిచాయి. యజమానులు వాటిని తొలగించకపోవడంతో విషసర్పాలకు ఆవాస కేంద్రాలుగా మారాయి. అవి గృహాల్లోకి వస్తున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మొక్కలు గుబురుగా పెరగడంతో పందులు కూడ అందులో నివాసం చేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఖాళీ స్థల యజమానులతో మాట్లాడి సమస్యను పరిష్కరించమని గతంలో అనేక సార్లు సచివాలయ సిబ్బంది పురపాలక సంఘ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని కాలనీ వాసులు ఆవేదన చెందుతున్నారు.

✤ విద్యానగర్, శ్రీనగర్‌కాలనీలో శ్రీరంగపురం సాగునీటి కాలువపై నిర్మించిన వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వంతెనల అడుగుభాగం పగుళ్లిచ్చి సువ్వలు సైతం బయట పడ్డాయి. వంతెనలకు ఇరువైపులా ఏర్పాటు చేసిన సైడ్ వాల్స్ విరిగిపోయాయి. వాటికి మరమ్మతులు చేయించాలని కాలనీ వాసులు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదని స్థానికులు వాపోతున్నారు. శ్రీనగర్‌కాలనీ శివారు కాలువపై కలిబాట వంతెనలు నిర్మించకపోవడంతో తాటి బొత్తలు వేసుకుని రాకపోకలు కొనసాగిస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వమైనా సమస్యలను పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం.. దీనిపై ప్రజారోగ్యశాఖాధికారి శ్రీనివాసరావును న్యూస్‌టుడే వివరణ కోరగా స్థల యజమానులకు నోటీసులు జారీ చేసి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

తెనాలి టౌన్: కొలకలూరు కాలువ కట్ట నివాసితులైన పేదలకు గురువారం ట్రైబల్స్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ రావూరి అంజలి నిత్యావసరాలు పంపిణీ చేశారు. వరుస వానల కారణంగా వీరంతా ఉపాధి కోల్పోవుతున్నారని, వీరిని ప్రభుత్వం కూడా ఆదుకోవాలని కోరారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా పందుల పెంపకం

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: పట్టణ ప్రజలకు ఇబ్బంది కలిగించకుండా పందులు పెంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. ఆయన గురువారం కౌన్సిల్‌హాలులో నిర్వహించిన పెంపకందారుల సమావేశంలో మాట్లాడారు. పట్టణానికి దూరంగా ఉంచాలని, పందులు ఇళ్లల్లోకి వచ్చి కలిగించిన ఇబ్బందులపై ప్రజల నుంచి ఫిర్యాదులు అందినట్లు ఆయన విశదీకరించారు. ప్రజలను అసౌకర్యానికి గురి చేసే వారిపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో సహాయ కమిషనర్ లక్ష్మీపతిరావు, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె. హెలెన్ నిర్మల పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శేషన్న, పక్కన సహాయ కమిషనర్ లక్ష్మీపతిరావు, ఆరోగ్యాధికారిణి నిర్మల

బోర్డులపై ఉన్న ధరలకే విక్రయాలు


తెనాలి టౌన్, న్యూస్‌టుడే: స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని ప్రధాన రైతు బజార్‌ను తహసీల్దార్ గోపాలకృష్ణ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కూరగాయల ధరలు తెలిపే బోర్డులు, విక్రయాల తీరును పరిశీలించారు. ఇటీవల ప్రారంభించిన రాయితీ ధరలపై నూనెల విక్రయ కేంద్ర నిర్వాహకునితో మాట్లాడారు. బోర్డులపై ఉన్న ధరలకే విక్రయాలు చేయాలని, వినియోగదారులతో మర్యాదగా మసలుకోవాలని స్పష్టం చేశారు. సీఎస్‌డీటీ మూర్తి, రైతు బజార్ పర్యవేక్షణాధికారి రామకృష్ణ ఉన్నారు.


నూనె విక్రయ కేంద్ర నిర్వాహకుడితో మాట్లాడుతున్న తహసీల్దార్

పెట్రోలింగ్ నిర్వహించండి: ఇటీవల సీలింగ్ ఊడి పడిన పట్టణంలోని 13వ వార్డు సచివాలయాన్ని తహసీల్దార్ గోపాలకృష్ణ గురువారం సందర్శించారు. రాత్రి సమయంలో ఆవరణలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని అందిన ఫిర్యాదులపై సిబ్బంది, స్థానికులతో మాట్లాడారు. ఈ మార్గంలో పెట్రోలింగ్ పెంచాలని పోలీసులకు సూచించారు. నిర్వహణ లోపాలపై మున్సిపల్ సిబ్బందితో మాట్లాడారు.

ఆర్థిక నేరాలపై అప్రమత్తత అవసరం

కొల్లిపర, న్యూస్‌టుడే: నేర ప్రవృత్తిలో కొత్తపోకడలను అనుసరిస్తున్నారని డీఎస్పీ బి.జనార్దనరావు అన్నారు. వారధి కార్యక్రమంలో భాగంగా అత్తోటలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ బాధితుల అనుభవాలను ఆయన వివరించారు. చరవాణిలో నగదు లావాదేవీలు చేయటంలో అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీలను ఇతరులతో పంచుకోవద్దని హితవుపలికారు. గుర్తుతెలియని వ్యక్తులకు ఆధార్, బ్యాంకు వివరాలు అందించవద్దన్నారు. లాటరీలు వచ్చాయని, నగదు ప్రోత్సాహాలు వచ్చాయని చరవాణిలో వచ్చే లింకులకు స్పందించటం సరికాదన్నారు. ఆర్థిక నష్టం జరిగితే తక్షణ సాయం పొందేందుకు సమాచారాన్ని పోలీసులతో, బ్యాంకు సిబ్బందితో సంప్రదించాలని సూచించారు. శిక్షణ డీఎస్పీ భార్గవి, సీఐ బెల్లంశ్రీనివాసరావు, ఎస్సై పి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎస్పీ జనార్దనరావు

ప్రజా సంక్షేమానికి కూటమి ప్రాధాన్యం

పొన్నూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత కల్పించామని పొన్నూరు వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మాదాల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. పల్లెపండగ వారోత్సవాల్లో భాగంగా గురువారం ఆరెమండ, గాయంవారిపాలెం, తాళ్ళపాలెం, దండమూడి గ్రామాల్లో సిమెంటు రహదారులు, మురుగు కాలువ నిర్మాణ పనులకు కూటమి నేతలు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైకాపా పాలనలో ప్రజా సమస్యలను పరిష్కరించే ప్రక్రియలో పూర్తిగా వైఫల్యం చెందారని విమర్శించారు.

చేబ్రోలు, న్యూస్‌టుడే: మండలంలోని మంచాల, తోట్లపాలెం, శ్రీరంగపురం గ్రామాల్లో రూ.10లక్షలతో నూతనంగా నిర్మించనున్న సిమెంటు రోడ్లకు గురువారం స్థానిక కూటమి నాయకులు భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో తెదేపా, జనసేన మండల అధ్యక్షులు రామరాజు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.


ఆరెమండలో భూమి పూజలో కూటమి నేతలు

అర్చకులకు నోటీసులు

పెదకాకాని, న్యూస్‌టుడే: పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలోని అర్చకులపై స్థానిక భక్తుడు పెండ్యాల నాగసురేష్ ఈవో గోగినేని లీలా కుమార్‌కి ఫిర్యాదు చేశారు. ఈ నెల 14న స్వామికి అభిషేక పూజలు నిర్వహించేందుకు ఆలయానికి వెళ్లగా.. ఆ సమయంలో శాశ్వత ప్రాతిపదికన విధులు నిర్వహించే అర్చకులు లేకపోవడం, వారి సహాయక అర్చకులు అభిషేక పూజలు నిర్వహించారని ఆరోపిస్తూ ఆయన ఈ నెల 15కాయన ఈవో ఫిర్యాదు చేయగా.. ఈవో స్పందించి అదే రోజు అర్చకులందరికీ నోటీసులు ఇచ్చారు. దీనిపై ఈవోని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా వారు ఇచ్చే వివరణ తరువాత చర్యలు ఉంటాయని తెలిపారు.

పురపాలక సంఘం డీఈగా వెంకయ్య

పొన్నూరు: పొన్నూరు పురపాలక సంఘం డీఈగా వెంకయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో పల్నాడు జిల్లా వినుకొండ పురపాలక సంఘంలో డీఈగా విధులు నిర్వహించారు. ఇన్‌ఛార్జి డీఈ ఏడుకొండలు వెంకయ్యకు బాధ్యతలు అప్పగించారు. కమిషనర్ ముప్పాళ్ల రమేషుబాబును ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు.

బాలాజీరావుపేటలో దొంగతనం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పట్టణ బాలాజీరావుపేట నివాసితురాలైన బీఎస్ఎన్ఎల్ ఉద్యోగిని ఈ నెల 16న ఇంటికి తాళం వేసి విధులకు హాజరై సాయంత్రం తిరిగి ఇంటి వెళ్లి చూసే సరికి తలుపునకు వేసిన తాళం పగులగొట్టి ఉంది. లోపల బీరువాలో ఉండాల్సిన సుమారు రూ. 2 లక్షలకు పైగా విలువైన బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి గురువారం ఫిర్యాదు చేసినట్లు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు. క్లూస్ బృందం వచ్చి ఆధారాలు సేకరించింది.


చోరీ సొత్తు స్వాధీనం

చందోలు(పిట్టలవానిపాలెం) : పిట్టలవానిపాలెం గ్రామంలో 2023 నవంబరులో కళ్లేపల్లి శ్రీనివాసరాజు ఇంట్లో జరిగిన చోరీకి సంబంధించిన సొత్తును గురువారం స్వాధీనం చేసుకున్నట్లు చందోలు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. శ్రీనివాసరాజు ఇంట్లో రెండు సవర్ల బంగారు గొలుసు, సోనీ కలర్ టీవీ చోరీకి గురైంది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా పొన్నూరు పట్టణానికి చెందిన షేక్ కరీముల్లాను నిందితుడిగా గుర్తించి గురువారం అరెస్టు చేసి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరు పరిచినట్లు పేర్కొన్నారు.

చిత్రం భళా


తన్నీరు విష్ణువర్ధన్

పట్టణ ఐతానగర్‌లోని ఎన్ఎస్ఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆరో తరగతి విద్యార్థి 'తన్నీరు విష్ణు వర్ధన్' పదో తరగతిలో పాఠ్యాంశంగాని రామాయణ ఇతిహాస చిత్రాలను ఆవిష్కరించి అందరి అభినందనలు అందుకున్నారు. వాల్మీకి జయంతి సందర్భంగా పాఠ్యాంశంలోని చిత్రాలను గీసి బడికి తీసుకురావాలని బుధవారం విద్యార్థులకు సూచిస్తే విష్ణువర్ధన్ ఒక్క రోజుల్లో ఆరు చిత్రాలను ఆవిష్కరించి గురువారం బడికి తీసుకు వచ్చాడని చిత్రకళోపాధ్యాయుడు బెల్లంకొండ వెంకట్ తెలిపారు.


వాల్మీకి చిత్రం

విష్ణువర్ధన్‌ను ఉపాధ్యాయులు అభినందించారు. చిత్రకళా సామగ్రిని బహూకరించారు.

- న్యూస్‌టుడే, తెనాలి టౌన్

సీపీఎం సభ విజయవంతానికి పిలుపు


సమావేశంలో పాశం రామారావు, నాయకులు

పెదకాకాని, న్యూస్‌టుడే: ఈ నెల 21వ తేదీన గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించనున్న సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాశం రామారావు తెలిపారు. పెదకాకాని సుందరయ్యకాలనీలో గురువారం స్థానిక పార్టీ నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో భాజపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వీర్యం చేసి కార్పొరేటు కంపెనీలకు లబ్ధి చేకూరేలా చూస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగి సామాన్యుడు జీవించే పరిస్థితి లేదని దుయ్యబట్టారు. సీపీఎం ఆధ్వర్యంలో జరిగే సభకు ప్రతి ఇంటి నుంచి ఒక్కరు చొప్పున హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు నన్నపనేని శివాజీ, సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారు బాధ్యతల స్వీకరణ

పొన్నూరు, న్యూస్‌టుడే: పొన్నూరు తహశీల్దారుగా మహమ్మద్ జియా ఉల్ హక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పల్నాడు జిల్లా మాచర్ల తహసీల్దారుగా పనిచేస్తూ.. బదిలీపై ఇక్కడకు వచ్చారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఆయన్ని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

19 దుకాణాలు ప్రారంభం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి పట్టణం, మండలం, కొల్లిపర మండలాల పరిధిలో మొత్తం 20 ప్రైవేటు మద్యం దుకాణాలు కేటాయించగా వాటిల్లో 19 ప్రారంభం అయ్యాయని ఆబ్కారీ విభాగ సీఐ వెంకటాచలం గురువారం తెలిపారు. పట్టణంలోని ఆ ఒక్క దుకాణం సాంకేతిక కారణాలతో నిలిచిందని, శుక్రవారం అది కూడా ప్రారంభం అవుతుందని వివరించారు.

ఘనంగా వాల్మీకి జయంతి

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: వాల్మీకి జయంతిని గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటం వద్ద మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్న, సహాయ కమిషనర్ వి.లక్ష్మిపతిరావు, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె. హెలెన్ నిర్మల, పలువురు అధికారులు, సిబ్బంది నివాళులు అర్పించారు.

ఉత్సాహం 'పరుగు'లెత్తె..


డిస్క్‌త్రో


పరుగు పందెంలో..

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో గురువారం 35 సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయ. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. – ఈనాడు, గుంటూరు


హైజంప్ చేస్తూ..

ఇళ్ల మధ్య మద్యం దుకాణం వద్దని ఆందోళన


పోలీస్‌స్టేషన్ వద్ద తెదేపా నాయకులు, మహిళలు

చేబ్రోలు,న్యూస్‌టుడే: ఇళ్ల మధ్యలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని మహిళలు ఆందోళన చేపట్టారు. అనంతరం చేబ్రోలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మండలంలోని వేజండ్లలోని మద్యం దుకాణాన్ని తెనాలికి చెందిన వ్యక్తి లాటరీలో దక్కించుకున్నారు. గ్రామంలో గతంలో ప్రభుత్వ మద్యం దుకాణం ఏర్పాటు చేసిన ప్రదేశంలోనే ఇప్పుడూ ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తుండడంతో స్థానిక మహిళలు, తెదేపా నాయకులతో కలిసి ఆందోళన చేపట్టారు. అనంతరం చేబ్రోలు పోలీస్‌స్టేషన్‌లో, ప్రత్తిపాడు ఆబ్కారీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

గతంలోనే ఫిర్యాదు.. ప్రభుత్వ మద్యం దుకాణం ఇళ్ల మధ్యలో ఉండడంతో మందు బాబులు అక్కడే వీరంగం చేయడం.. మహిళలు అటుగా వెళ్తుంటే అసభ్యకర పదజాలం ఉపయోగించడంతో మద్యం దుకాణం తొలగించాలని గతంలోం బాదుడే బాదుడు కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించిన అప్పటి మాజీ ఎమ్మెల్యే నరేంద్ర కుమార్‌కు మహిళలు విన్నవించుకున్నారు.

వర్షంతో అవస్థలు


చినరావూరు మలుపులో రోడ్డుపై..

తెనాలి టౌన్, చేబ్రోలు, న్యూస్‌టుడే

తెనాలి పట్టణ చినరావూరు మార్గం మలుపులో చిన్న పాటి వానకే రోడ్డు మునిగిపోతుంది. కాలువలోకి వెళ్లిపోయే మార్గాలు సరిగ్గా లేక ఈ పరిస్థితి తరుచూ చోటు చేసుకుంటుంది. వాన నీరు రోడ్డుపై ఉన్న సమయంలో గుంతలు కనిపించక వాహనదారులు పడుతున్న ఘటనలు తరుచూ చోటు చేసుకుంటున్నాయి. చేబ్రోలు మండలం నారాకోడూరులోని దేవాదాయశాఖ ఆధీనంలోని చెరువు చుట్టూ ఆక్రమణలకు గురికావడంతో ఇళ్లలోకి వర్షం నీరు చేరుతోంది. జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఎదురు రోడ్డులో సిమెంటు రోడ్డుపైన పలు ఇళ్లలోకి నీళ్లు చేరడంతో వాటిని ఎత్తిబయట పోసుకుంటున్నారు.


నారాకోడూరులో సిమెంటు రోడ్డుపైన..


నారాకోడూరు: ఇంటిలోకి చేరిన నీరు

హుండీ ఆదాయం లెక్కింపు

దుగ్గిరాల, న్యూస్‌టుడే : కంఠంరాజు కొండూరు మహంకాళి అమ్మవారి ఆలయంలో హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. నాలుగు నెలలకు గాను రూ. 15,81,924 వచ్చినట్లు ఈవో సునీల్ కుమార్ తెలిపారు. ఇది గత ఆదాయం కంటే రూ. 3,71,457 ఎక్కువగా వచ్చిందని చెప్పారు. దేవాదాయ శాఖ అధికారి సీహెచ్ వెంకట శ్రీనివాసులు, వంశపారంపర్య ధర్మకర్త దేవభక్తుని రంగప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

గుంటూరు తూర్పు

నేడు 'డయల్ యువర్ డీఎం'

పట్నంబజారు, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్టాండులో ఈ నెల 18 ఉదయం 11గంటల నుంచి 12 వరకు డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్ సలాం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు నుంచి హైదరాబాద్, తెనాలి, విజయవాడ, విశాఖపట్నం మార్గాల్లో ప్రయాణం చేసే ప్రయాణికులు తమ సందేహాల్ని అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. ప్రయాణికులు తమ సమస్యల్ని తెలిపేందుకు 9959225421 ఫోన్ నెంబరుకు సంప్రదించాలన్నారు.



ఎన్టీఆర్ రైతు బజారులో ధరలు నిన్నటివి.. (కిలో రూ.ల్లో) టమాట 48, వంగ 24, బెండ 22, పచ్చిమిర్చి 45, కాకర 34, క్యారెట్ 45, క్యాలీఫ్లవర్ 38, క్యాబేజీ 45, బీర 28, దొండ 26, బంగాళదుంప 39, ఉల్లి పాయలు 32, గోరుచిక్కుళ్లు 30, దోస 32, పొట్ల 32, మునగ 8, పెద్ద చిక్కుళ్లు 84, చామదుంప 40, మునగ రూ.8, గోంగూర 10, తోటకూర 15, కొత్తిమీర 25, బీట్‌రూట్ 39, కీర 24, క్యాప్సికం 64, అల్లం 60, ఫ్రెంచి బీన్స్ 94, సొర 16, అరటి 7.

- న్యూస్‌టుడే, పట్నంబజారు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

94406 38515, 80085 73097

? బాలాజీనగర్ 9వ లైను శివార్లల్లో కొద్దిరోజుల నుంచి మురుగునీరు సరఫరా అవుతుంది. ఇప్పటికే ఆ నీటిని తాగి చాలా మంది రోగాల బారిన పడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. తాగునీటిలో మురుగునీరు సరఫరా కాకుండా తగిన చర్యలు తీసుకోవాలి. **- రామ గణేష్- మదర్ థెరెసా బొమ్మ సెంటర్**

✔ సమస్యను అధికారులకు వివరించి పరిష్కరిస్తాం.
- ఐజాక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ – న్యూస్‌టుడే, పట్నంబజారు

రైతుబజారులో వ్యర్థాల తొలగింపు

పట్నంబజారు, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ రైతుబజారులో పేరుకుపోయిన వ్యర్థాల్ని గురువారం అధికారులు తొలగించారు. రైతుబజారులో వ్యర్థాల్ని తొలగించటంలేదని పలువురు వినియోగదారుల నుంచి 'మేమున్నాం..మీకుతోడుగా'కు వచ్చిన ఫిర్యాదుల్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, స్పందించిన అధికారులు వ్యర్థాల తొలగింపునకు చర్యలు చేపట్టారు.

స్పందనకు వందనం

✤ పాతగుంటూరు పరిసర ప్రాంతాల్లో నెలకొన్న లో-ఓల్టేజీ సమస్యను పరిష్కరిస్తామని విద్యుత్తుశాఖ ఏఈ మస్తాన్ తెలిపారు. సుద్దపల్లిడొంకరోడ్డు సెంటర్, కొండయ్య కాలనీ పరిసర ప్రాంతాల్లో లో-ఓల్టేజీ కారణంగా ఇళ్లలోని విలువైన సామగ్రి పాడైపోతున్నాయని స్థానికులు 'మేమున్నాం..మీకుతోడుగా' ద్వారా సమస్యను విద్యుత్తుశాఖ ఏఈ మస్తాన్ దృష్టికి తీసుకెళ్లగా, పలు ప్రాంతాల్లో నూతన విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి లో-ఓల్టేజీ సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు

ఆక్రమణలు ఇలా.. రాకపోకలు ఎలా..?

నగరంలో ఇదీ పరిస్థితి

నగరపాలక సంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే


మార్కెట్ వద్ద రహదారి పక్కన ఏర్పాటు చేసిన దుకాణాలు


ఆర్టీసీ బస్టాండ్ వెనుక రోడ్డులో ఇలా...

నగరంలో రద్దీగా ఉండే రహదారుల ఆక్రమణలతో నిత్యం ప్రజలు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆ సమస్యలను పరిష్కరించేందుకు జీఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. చిరు వ్యాపారులు, తోపుడు బండ్ల వర్తకులు, మెకానిక్ దుకాణాల నిర్వాహకులు రోడ్లపైకి జరిగి ఆక్రమించడం వల్ల ఇబ్బందులు వస్తున్నాయి. ఈ సమస్యను పరిష్కరించి ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు నగరపాలక సంస్థ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా చర్యలు చేపడుతున్నా ఆశించిన ఫలితాలు రావడం లేదు. ఈ నేపథ్యంలో మార్జిన్లు, కాల్వలపై ఆక్రమణలు చేసే వారిపై చర్యలు తీసుకునేందుకు అధికార యంత్రాంగం దృష్టి సారించింది.

లైసెన్స్‌లు జారీ చేయవద్దు..

కొందరు రోడ్లపై ఆక్రమించిన దుకాణాలకు కూడా జీఎంసీ ప్రజారోగ్య విభాగం నుంచి డీఅండ్‌వో ట్రేడ్ లైసెన్స్‌లు పొందుతున్నారు. వాటిని చూపి విద్యుత్తు కనెక్షన్లు పొంది దుకాణాలు నిర్వహించుకుంటున్నట్లు అధికారులు గుర్తించారు. ఇక నుంచి ఆక్రమణలు చేసిన వారికి డీఅండ్‌వో లైసెన్స్‌లు జారీ చేయవద్దని కమిషనర్ శ్రీనివాసులు ఆదేశాలు ఇచ్చారు. కాల్వలపైకి, రహదారి మార్జిన్లపై వ్యాపారాలు చేసేవారు స్వచ్ఛందంగా తమ దుకాణాలను తొలగించుకోవాలని ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా ఉన్న ప్రాంతాల్లోనే కొనసాగించాలని ఆయన సూచించారు.

ఈ ప్రాంతాల్లోనే అధికం..

ట్రాఫిక్ పెరుగుతున్న నేపథ్యంలో నగరంలో పలు రోడ్లను విస్తరించి, అభివృద్ధి చేశారు. కానీ ఆక్రమణలతో ఆయా రహదారులు కుంచించుకుపోయి ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. నగరపాలక సంస్థ ఎదుట నుంచి పల్నాడు బస్టాండ్ వరకు, పీవీకే నాయుడు కూరగాయల మార్కెట్ ఎదుట, లాలాపేట, పాత బస్టాండ్ కూడలి, గుంటూరువారితోట రోడ్డు, విజయ థియేటర్ రోడ్డు, ఓల్డ్‌క్లబ్ రోడ్డు, నాజ్ సెంటర్ నుంచి రైల్వేస్టేషన్ రోడ్డు, బ్రాడీపేట నాల్గో లైను, అరండల్‌పేట రెండో అడ్డరోడ్డు, కొరిటెపాడు, లక్ష్మీపురం, బృందావన్ గార్డెన్స్, గుజ్జనగుండ్ల, స్తంభాలగరవు, పట్టాభిపురం, నగరంపాలెం ప్రాంతాల్లోని ప్రధాన రహదారులలో ఆక్రమణలు పెచ్చుమీరి ట్రాఫిక్‌కు ఇబ్బందులు తప్పడం లేదు.

అమ్మవారి చీరల వేలంపాట

పట్నంబజారు, న్యూస్‌టుడే: పొన్నూరు రోడ్డులోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో గురువారం చీరల వేలంపాట నిర్వహించారు. దసరా దేవీశరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరెల్ని ఆలయ నిర్వాహకులు వేలం వేశారు. 425 చీరలకు వేలంపాట ద్వారా మొత్తం రూ.2,10,335 వసూలైనట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు మారెడ్డి శ్రీనివాసరెడ్డి, సెక్రటరీ మోరబోయిన నరసింహారావు, మద్దిరెడ్డి జగన్ మోహన్‌రెడ్డి, మల్లం సత్యనారాయణ, అరవ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

భాగవతం అమృతఫలం

ఏటీ అగ్రహారం: భాగవతం మానవాళికి శుక యోగీంద్రుడు ప్రసాదించిన అమృతఫలమని డాక్టర్ కోగంటి వెంకట శ్రీరంగనాయకి అన్నారు. ఆనందతీర్థ అగ్రహారంలోని కంచి కామకోటిపీఠ పాలిత శ్రీశంకర గాయత్రి దత్తసాయి సత్యదేవ మందిరంలో గురువారం భాగవత సప్తాహం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆమె భాగవత మాహాత్మ్యాన్ని వివరించారు. సప్తాహ కార్యక్రమం ఈ నెల 23వ తేదీ వరకు జరుగుతుంది. 24న గీతా పారాయణం, విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, రుక్మిణీ కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు రాళ్లభండి వెంకట సత్య రామాంజనేయశర్మ తెలిపారు.

నాలుగు రోడ్ల కూడలి మూసివేత


మాట్లాడుతున్న సీఐ శింగయ్య, ఎస్సై శ్రీహరి

గుంటూరు నేరవార్తలు: పట్టాభిపురంలోని నాలుగురోడ్ల కూడలి తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు పశ్చిమ ట్రాఫిక్ సీఐ శింగయ్య తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. పట్టాభిపురం పిల్లల ఆసుపత్రి సమీపంలోని నాలుగురోడ్ల కూడలి వద్ద ఇటీవల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణతోపాటు ట్రాఫిక్ రద్దీని నియంత్రించటానికి నాలుగురోడ్ల కూడలిని తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు చెప్పారు. గుజ్జనగుండ్లవైపు వెళ్లే వాహనచోదకులు మహాత్మాగాంధీ బొమ్మవద్ద మలుపు తీసుకొని వెళ్లాలన్నారు. పట్టాభిపురం బ్రిడ్జి వైపు వెళ్లేవాళ్లు డీఆర్‌ఎంవో కార్యాలయం వద్ద మలుపు తీసుకుని ప్రయాణించాలన్నారు.

'సజ్జలను తక్షణమే అరెస్టు చేయాలి'

పట్టాభిపురం, న్యూస్‌టుడే: 'గత ప్రభుత్వంలో సలహాదారుగా వ్యవహరించిన సజ్జల రామకృష్ణారెడ్డి కనుసన్నల్లోనే అన్నీ జరిగాయి. తెదేపా జాతీయ కార్యాలయం, చంద్రబాబు ఇంటిపై దాడి కేసుల్లో ప్రధాన కుట్రదారుడిగా ఉన్న ఆయన్ని తక్షణమే పోలీసులు అరెస్టు చేయాలి'.. అని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మ డిమాండ్ చేశారు. గుంటూరులో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'పోలీసుల విచారణలో సజ్జల వారికి సహకరించడంలేదు. వైకాపా నేతలు అందరూ ఒకే పాట పాడుతున్నారు. పోలీసులు అడిగిన ప్రశ్నలకు మాకు తెలియదు. గుర్తు లేదు.. అని తప్పించుకోవాలని చూస్తున్నారు. సెల్‌ఫోన్లు ఇవ్వమని పోలీసులు అడిగితే సహకరించడంలేదు. ఓ వైపు సజ్జలకు, మరోవైపు రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌కుమార్‌కు పోలీసులు రాచమర్యాదలు చేయడం ఎంతవరకు సమంజసం. పోలీసులు తీరు మార్చుకోవాలి. లేకపోతే తెదేపా శ్రేణులు పోలీస్ స్టేషన్ల ముందు ధర్నాలు చేసే వరకు పరిస్థితి వస్తుంది'.. అని ఆయన హెచ్చరించారు.

ఆడిట్ రికార్డులు అప్‌డేట్ చేయండి

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: స్థానిక సంస్థల్లో నిర్వహించిన ఆడిట్‌కు సంబంధించి రికార్డులను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని ఆడిట్ శాఖ మూడో జోన్ ప్రాంతీయ ఉప సంచాలకుడు నాగ శ్రీనివాస్ అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా గుంటూరులోని ఆ శాఖ జిల్లా ఆడిట్ అధికారి కార్యాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు.

నాన్‌రెసిడెన్షియల్ విధానంలో నిర్వహించాలి


డీఈవో శైలజకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా ఒకటి, రెండు తరగతులు బోధించే ఉపాధ్యాయులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు నాన్‌రెసిడెన్షియల్ విధానంలో నిర్వహించాలని ఏపీటీఎఫ్(1938) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల సుబ్బారావు పేర్కొన్నారు. గురువారం ఏపీటీఎఫ్ నాయకులు డీఈవో శైలజను కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ.. శిక్షణలో పాల్గొనే ఒంటరి మహిళలు, చిన్నపిల్లల తల్లులు, అనారోగ్యానికి గురైన తల్లిదండ్రులు ఉన్న ఉపాధ్యాయులు శిక్షణకు హాజరుకాలేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందు వేళంగణిరాజు, కట్టబోయిన నరసింహారావులు మాట్లాడుతూ ఎస్‌సీఈఆర్‌టీ నియామకాల్లో మున్సిపల్ ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని కోరారు.

అధ్వానంగా మారిన బస్సు షెల్టర్



ప్రయాణికుల సౌకర్యార్థం నగర ప్రధాన రహదారుల్లో నిర్మించిన బస్సు షెల్టర్లు అధ్వాన స్థితికి చేరాయి. ఇందుకు కాకాని రోడ్డులో శిథిలావస్థకు చేరిన బస్సు షెల్టరే నిదర్శనం. షెల్టర్‌లో కింద బండలు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిసిన సందర్భాల్లో ఇక్కడ కూర్చున్న ప్రయాణికులకు బురద అయ్యి ఇళ్ల దారి పడుతున్నారు. అధికారులకు వీటిపై పర్యవేక్షణ లేకపోవడం వల్లనే ఈ పరిస్థితులు నెలకొంటున్నాయని పలువురు నగరవాసులు అభిప్రాయ పడుతున్నారు. కార్పొరేషన్ అధికారులు ఇప్పటికైన స్పందించి అధ్వానంగా మారిన బస్సు షెల్టర్‌లో బండలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. **-న్యూస్‌టుడే, పట్నంబజారు**

పొంచి ఉన్న ముప్పు



పట్నంబజారు, న్యూస్‌టుడే: పాత బస్టాండు గణేష్ మహల్ సెంటర్ వద్ద స్తంభానికి ఏర్పాటు చేసిన విద్యుత్తు వైర్ల బాక్స్ ప్రమాదకరంగా మారింది. ఈ ప్రాంతంలో 6 నెలల కిందట అధికారులు కొత్తగా విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేశారు. వాటిని వెలిగించేందుకు బాక్స్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ బాక్స్ ప్రమాదకరంగా మారింది. నిత్యం వీధి లైట్లు వెలిగించేందుకు కార్పొరేషన్ ఎలక్ట్రికల్ సిబ్బంది రాకపోవడంతో స్థానికులే లైట్లు వేస్తున్నారు. వర్షాలు కురిసిన సందర్భాల్లో బాక్స్‌లోని వైర్లు తడిచి స్తంభానికి విద్యుత్తు సరఫరా అవుతున్నా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవటం లేదని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా స్పందించి కొత్త విద్యుత్తు బాక్స్‌ను ఏర్పాటు చేయాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

గుంటూరు విద్యుత్తు, న్యూస్‌టుడే: టౌన్-2 సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్తు లైన్ల మరమ్మతులు చేస్తున్నందున ఈనెల 18న విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ గురవయ్య తెలిపారు. దీనివల్ల శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బ్రాడీపేటలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

వాల్మీకి జీవితం అనుసరణీయం


వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మేయర్ మనోహర్‌నాయుడు, కమిషనర్ శ్రీనివాసులు తదితరులు


వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: రామాయణం ప్రతి ఒక్కరూ చదవాల్సిన గ్రంథమని, అలాంటి గ్రంథాన్ని రచించిన ఆదికవి వాల్మీకి జయంతి వేడుకలు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం శుభపరిణామమని మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు అన్నారు. సోమవారం జీఎంసీ కౌన్సిల్‌హాల్‌లో వాల్మీకి చిత్రపటానికి కమిషనర్ శ్రీనివాసులు, ఇతర అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. మనసు నుంచి చెడు తత్వాన్ని తొలగించుకుని సమాజ ఉన్నతికి దోహదపడిన వాల్మీకి జీవితం అనుసరణీయమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ బాలవజ్రబాబు, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డీసీలు శ్రీనివాస్, డి.శ్రీనివాసరావు, ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, ఎంహెచ్‌వో డాక్టర్ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు నేరవార్తలు: పోలీసు కార్యాలయంలో గురువారం వాల్మీకి మహర్షి జయంతి నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి ఎస్పీ సతీష్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సంప్రదాయ భారతీయ కవిత్వంలో వాల్మీకి మహర్షి చిరస్మరణీయులని కొనియాడారు. కార్యక్రమంలో ఏఎస్పీ సుప్రజ, హనుమంతు, డీఎస్పీలు శాంతకుమార్, సీతారామయ్య, ఆర్ఐలు శ్రీనివాసరావు, శివకృష్ణ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు సహకరించాలి


కమిషనర్ శ్రీనివాసులుకు ప్రతిపాదనల లేఖ అందజేస్తున్న తూర్పు ఎమ్మెల్యే నసీర్

నగరపాలకసంస్థ(గుంటూరు): గుంటూరు ఆటోనగర్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు జీఎంసీ నుంచి సహకరించాలని తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అన్నారు. గురువారం కమిషనర్ శ్రీనివాసులును ఆయన ఛాంబర్‌లో కలిసి అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనల లేఖను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ.. ఆటోనగర్‌లో పన్నుల రూపంలో వసూలు చేసిన రూ.6 కోట్లు జీఎంసీకి చెల్లించినట్లు తెలిపారు. ఆటోనగర్ అభివృద్ధి విషయమై శనివారం సాయంత్రం 4 గంటలకు ఏపీఐఐసీ, మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. దీంతో పాటు నియోజకవర్గంలో అకాల వర్షాలకు రహదార్లపై పడిన గోతులకు ప్యాచ్‌వర్క్‌లు చేపట్టాలని, బొంగరాలబీడు- శారదాకాలనీ రోడ్డు, సుద్దపల్లి డొంక రహదార్ల విస్తరణ, అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఆచార్య జీఎన్ సాయిబాబాకు నివాళి


కొవ్వొత్తులతో ప్రజాసంఘాల నాయకుల ప్రదర్శన

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: దిల్లీ విశ్వవిద్యాలయ పూర్వ ఆచార్య జీఎన్ సాయిబాబాకు గురువారం గుంటూరు లాడ్జి కూడలిలో ప్రజాసంఘాల నాయకులు నివాళులర్పించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి మాట్లాడుతూ.. ఉపా చట్టాన్ని రద్దు చేయాలని, ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలపై హత్యాకాండను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పోతురాజు, ప్రసాద్, యోహాను, రుక్మిణి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ రోగులకు ఉపశమన కేంద్రం


కొలాస్టమీ, పెయిన్ మేనేజ్‌మెంట్ క్లినిక్ ప్రారంభిస్తున్న నాగకిశోర్

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: క్యాన్సర్ బాధితులకు ప్రయోజనం కలిగేవిధంగా గుంటూరు ఒమెగా క్యాన్సర్ ఆసుపత్రిలో కొలాస్టమీ, పెయిన్ మేనేజ్‌మెంట్ సెంటర్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు చీఫ్ సర్జికల్ ఆంకాలజిస్ట్ నాగకిశోర్ తెలిపారు. గుంటూరు మెహర్‌నగర్‌లోని ఆసుపత్రిలో ఈ క్లినిక్‌ను ఏర్పాటు చేసినందున పేగు క్యాన్సర్ వ్యాధిగ్రస్థులకు మెరుగైన చికిత్స అందుతుందని నాగకిశోర్ వివరించారు. ఈ క్లినిక్‌లో కొలాస్టమీ కేర్ నిపుణులు అందుబాటులో ఉన్నందున బాధితులకు సత్వరమే చికిత్స అందడమే గాకుండా, అవసరమైన కౌన్సెలింగ్ ఇస్తారన్నారు. జబ్బు, దాని పరిణామాల గురించి వివరిస్తారన్నారు. బాధల్ని ఉపశమింపజేసే మందుల్ని ఇవ్వడం కోసం పెయిన్ మేనేజ్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. పూర్తి సమాచారం కోసం 0863-2223300, 91211 06728, 93905 13232 నంబర్లకు ఫోన్ చేయాల్సిందిగా కోరారు.

ఆధునికీకరించిన కార్యాలయం ప్రారంభం

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: ఆధునికీకరించిన సూపరింటెండెంట్ కార్యాలయాన్ని కిరణ్‌కుమార్ గురువారం ప్రారంభించారు. సమావేశాల నిర్వహణతో పాటు, వీడియో కాన్ఫరెన్స్ సదుపాయాన్ని కల్పించారు.

రేషన్ బియ్యం పాలిష్ చేసి అక్రమ రవాణా

ఇద్దరి అరెస్టు.. రూ.18 లక్షల సొత్తు స్వాధీనం: ఎస్పీ

నల్గొండ నేరవిభాగం, న్యూస్‌టుడే: రేషన్ బియ్యాన్ని మిల్లులో పాలిష్ చేసి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేయగా, ఒకరు పరారీలో ఉన్నట్లు నల్గొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. వారి నుంచి రూ.18 లక్షల విలువ చేసే 504.40 క్వింటాళ్ల రేషన్ బియ్యం, రెండు లారీలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు.

★ ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా కేంద్రానికి చెందిన చీమకుర్తి సుధాకర్ కొన్నేళ్లుగా రైతుల నుంచి సేకరించిన ధాన్యంతో పాటు గుంటూరు, బాపట్ల, నర్సారావుపేటలో రేషన్ బియ్యం తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నాడు. ఆ బియ్యాన్ని స్థానికంగా ఉన్న మిల్లులో పాలిష్ వేయడంతో పాటు నకిలీ బిల్లులు తయారీ చేసి రూ.30 కిలోల చొప్పున నెలకు 10 నుంచి 12 లోడ్‌లను తెలంగాణ, కర్ణాటక, గుజరాత్, రాజస్థాన్ ప్రాంతాలకు అక్రమ రవాణా చేస్తున్నాడు. విశ్వసనీయ సమాచారంతో వాడపల్లి చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేస్తుండగా పట్టుబడిన లారీతో పాటు అతడిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా వాస్తవాలు ఒప్పుకున్నట్లు తెలిపారు.

★ ఇదే క్రమంలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన సయ్యద్ సలావుద్దీన్ అనే లారీ డ్రైవర్ గురువారం లోడు రేషన్ బియ్యంతో వెళుతుండగా పౌరసరఫరాల శాఖ అధికారులకు సమాచారం రావడంతో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. గుంటూరు జిల్లా కేంద్రానికి చెందిన మరో నిందితుడు అశోక్ పరారీలో ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు, రూరల్ సీఐ వీరబాబు పాల్గొన్నారు.

వైభవంగా వార్షికోత్సవాలు


హరికథా గానం చేస్తున్న సింహాచలశాస్త్రి

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: లక్ష్మీపురం శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం 46వ వార్షికోత్సవాలు, వాగ్గేయకారుల మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. సంఘ కార్యదర్శి వల్లూరి కృష్ణకిశోర్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో ముప్పవరపు సింహాచల శాస్త్రి.. 'ముత్తుస్వామి దీక్షితుల చరిత్ర' అనే అంశంపై హరికథా గానం చేశారు. దీక్షితుల కృతులు, జీవన ఆదర్శాల నేపథ్యంలో కథ సాగింది.

దావా సమన్లు

IN THE COURT OF THE I ADDL. CIVIL JUDGE(JUNIOR DIVISION) : GUNTUR
O.S. No. 50 / 2023
Between:
State Bank of India, SMEC, Guntur Rep.by its Chief Manager. ...Plaintiff
And
Kotikala Sunitha@Sunitha Kumari ...Defendant
To,
Kotikala Sunitha @ Sunitha Kumari, W/o. Yohan, #7-4-39/A, Bongaralabeedu, 5th Line Guntur.
పైనెంబరు దావాలో ప్రతివాదికి సమన్లు నిమిత్తం పేపరు పబ్లికేషన్‌ద్వారా తెలియజేయమని కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున పైన ఉదహరించిన ప్రతివాది ది.28-11-2024న ఉ॥గం॥10-30ని॥లకు పైకోర్టువారిఎదుట హాజరై తమకుగల ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనియెడల మీపరోక్షమున తీర్మానించబడును.
కె.వి.ఆర్.హెచ్. ప్రసాద్
వాది తరపు అడ్వకేట్, గుంటూరు. సెల్: 9849084816

దావా సమన్లు

IN THE COURT OF THE I ADDL. CIVIL JUDGE(JUNIOR DIVISION) : GUNTUR
O.S. No. 871 / 2022
Between:
State Bank of India, SMEC, Guntur Rep.by its Chief Manager. ...Plaintiff
And
Bejjam Bhushanam. ...Defendant
To,
Bejjam Bhushanam,S/o.Musalaiah, R/o. # 7-5-253,2nd Line,Vengaiah Nagar,Guntur.
పైనెంబరు దావాలో ప్రతివాదికి సమన్లు నిమిత్తం పేపరు పబ్లికేషన్‌ద్వారా తెలియజేయమని కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున పైన ఉదహరించిన ప్రతివాది ది.20-11-2024న ఉ॥గం॥10-30ని॥లకు పైకోర్టువారిఎదుట హాజరై తమకుగల ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనియెడల మీపరోక్షమున తీర్మానించబడును.
కె.వి.ఆర్.హెచ్. ప్రసాద్
వాది తరపు అడ్వకేట్, గుంటూరు. సెల్: 9849084816

డ్రగ్స్ పట్టివేత

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: నగరంలో గురువారం డ్రగ్స్‌ను పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ప్రయివేట్ ట్రావెల్స్‌కు బస్సులో డ్రగ్స్ రవాణా చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఆ ట్రావెల్స్ కార్యాలయానికి వెళ్లి సోదాలు నిర్వహించారు. అక్కడ డ్రగ్స్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాటిని ఎవరు రవాణా చేశారు? ఇక్కడ ఎవరికి డెలివరీ ఇవ్వడానికి పంపించారు? రశీదులపై ఎవరి పేరుతో బస్సులో వచ్చింది? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తుంది. సమగ్ర దర్యాప్తు అనంతరం నిందితులను అరెస్టు చేసి అధికారికంగా ప్రకటించే అవకాశాలు ఉన్నాయి.

రోడ్డుప్రమాదంలో మెడికల్ రిప్రజెంటేటివ్ మృతి

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో మెడికల్ రిప్రజెంటేటివ్ మృతిచెందిన ఘటనపై గురువారం పశ్చిమ ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేలంగిణినగర్‌కు చెందిన రవికుమార్ (50) మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నారు. గురువారం మధ్యాహ్నం విధులు ముగించుకొని ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తుండగా అమరావతిరోడ్డు రామాబిల్డింగ్స్ సమీపంలో వెనుక నుంచి వచ్చిన నగరపాలకసంస్థ చెత్త తరలించే ట్రాక్టర్ అతని వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో రవికుమార్ అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న సీఐ శింగయ్య ఘటనాస్థలికి వెళ్లి ప్రాథమిక దర్యాప్తు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇద్దరిపై బీరుసీసాతో దాడి

గుంటూరు నేరవార్తలు: ఇద్దరిపై బీరు సీసాతో దాడి చేసిన ఘటనపై గురువారం నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వారి వివరాల ప్రకారం.. శ్రీనివాసరావుపేటకు చెందిన కోటేశ్వరరావు ఇళ్ల నిర్మాణాలకు సెంట్రింగ్ చెక్కల పని చేస్తుంటాడు. ఈ నెల 16న ఆటోలో సెంట్రింగ్ చెక్కలు వేసుకొని ఇంటి నిర్మాణపనులు జరుగుతున్న కృష్ణబాబుకాలనీకి వెళ్లాడు. అక్కడ చెక్కలను దించేసి తిరిగి లాల్‌పురంరోడ్డులోని బార్ వద్ద ఆగి మద్యం తాగడానికి లోపలికి వెళ్లాడు. అప్పటికే అక్కడ మద్యం తాగి ఉన్న ప్రవీణ్ మరో నలుగురు కలిసి కోటేశ్వరరావుతో గొడవ పెట్టుకున్నారు. వినాయకచవితి సమయంలో మండపానికి సెంట్రీ చెక్కలు ఇవ్వలేదంటూ బీరు సీసాతో దాడిచేశారు. అడ్డువెళ్లిన ఆటో డ్రైవర్ వినోద్‌పై కూడా బీరు సీసాతో దాడిచేశారు. ఇద్దరికి తీవ్రగాయాలవడంతో స్థానికులు ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఐదుగురుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వీరానాయక్ తెలిపారు.

గుంటూరు పశ్చిమ

ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాల్సిందే


సచివాలయాల సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: ప్రజల సమస్యల్ని ఎప్పటికప్పుడు పరిష్కరించాల్సిన బాధ్యత సచివాలయాల సిబ్బందిపైనే ఉందని పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి సూచించారు. గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవి సచివాలయాల సిబ్బందితో గురువారం సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ సచివాలయాలకు సిబ్బంది చాలా మంది సకాలంలో రాకపోగా.. ప్రజలకు సక్రమంగా సమాధానం చెప్పడం లేదన్నారు. ప్రజల సమస్యల్ని రోజుల తరబడి పెండింగ్‌లో ఉంచుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఇకపై ఆవిధంగా జరిగితే సహించేది లేదన్నారు. కొన్ని సచివాలయాల్లో ఏవోల పనితీరు కూడా సరిగా లేదన్నారు. డ్రెయినేజీ, పారిశుద్ధ్యం, ఖాళీ స్థలాల వల్ల ఇబ్బందులపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. పారిశుద్ధ్య సిబ్బందితో సమన్వయం చేసుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. శానిటరీ కార్యదర్శులు తప్పనిసరిగా క్షేత్ర స్థాయికి వెళ్లాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రతి బుధవారం ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ చేపట్టాలన్నారు. ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు ఇచ్చి.. వాటిని శుభ్రంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత కూడా తీసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు.

చిరు వ్యాపారులపై మానవత్వంతో మెలగాలి

పట్టాభిపురం : చిరు వ్యాపారుల పట్ల మానవతా దృక్పథంతో మెలగాలని పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి సూచించారు. తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసుకుంటున్న తమను తొలగించాలని మున్సిపల్ అధికారులు చెబుతున్నారని పలువురు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చి వాపోయారు. దీనికి మాధవి స్పందించి అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. చిరు వ్యాపారులు రోడ్ల మీదకు రాకుండా పక్కన వ్యాపారాలు చేసుకునేలా చూడాలని అధికారులకు సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా వ్యాపారాలు చేసుకోవాలని చిరు వ్యాపారులకు తెలియజేశారు.

ధర వరలు



పట్టాభిపురం, న్యూస్‌టుడే: కృష్ణనగర్ రైతుబజార్‌లో ధరలు(కిలో రూ.ల్లో) టమాట 40, వంగ 30, బెండ 25, పచ్చిమర్చి 43, కాకర 45, క్యారెట్ 48, బీర 45, క్యాబేజి 25, దొండ 27, బంగాళదుంప 39, ఉల్లిపాయలు 34, గోరుచిక్కుళ్లు 25, దోస 30, సొర 25, పొట్లకాయ 30, అరటికాయ 7, బీట్‌రూట్ 34, క్యాప్సికం 68, కీరదోసకాయ 24, కొత్తిమీర 25, ఆకుకూరలు 15, నిమ్మకాయలు 45, అల్లం 64, వెల్లుల్లి 340.

సమస్యలతో సహవాసం

✣ కృష్ణబాబుకాలనీలో గుంతల రహదారులు ✣ దోమల బెడదతో ఇబ్బందులు


తటాకాన్ని తలపిస్తున్న కాలనీ రహదారి

గుజ్జనగుండ్ల(ఎస్వీఎన్ కాలనీ), న్యూస్‌టుడే

కనీస మౌలిక వసతులు లేక గుజ్జనగుండ్లలోని కృష్ణబాబు కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. గుజ్జనగుండ్ల నుంచి పలకలూరు వెళ్లే దారిలో ఈ కాలనీ ఉంది. కాలనీ ఏర్పడి ఇప్పటికి రెండు దశాబ్దాలు గడిచినా, నేటికీ సరైన వసతులు లేక అవస్థల మధ్య కాలం వెళ్లదీస్తున్నారు. సమస్యలు పరిష్కరించాలని నగరపాలక సంస్థ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు మొర పెట్టుకున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడని కాలనీవాసులు వాపోతున్నారు.

కాలనీలో మొత్తం నాలుగు లైన్లలో సుమారు 1,000 మంది నివాసం ఉంటున్నారు. 39వ డివిజన్‌లోని సచివాలయం 106 పరిధిలో ఉంది. కాలనీలో సరైన రహదారుల సౌకర్యం లేదు. మురుగు కాల్వలు సక్రమంగా లేకపోవడంతో వర్షం పడితే తాటాకాన్ని తలపిస్తోంది. మోకాళ్ల లోతు నీళ్ల నిలిచిపోయిన సందర్భాలున్నాయి. దీంతో భారీ వర్షం పడితే ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంటుందని స్థానికులు వాపోతున్నారు. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగు నీరు ముందుకు కదలడంలేదు. వారాల తరబడి పూడిక పేరుకుపోవడంతో దుర్వాసన భరించలేక జనం సతమతం అవుతున్నారు. అక్కడక్కడా ఖాళీ స్థలాల్లో నీరు నిలిచిపోయి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా తయారయ్యాయి. దోమల బెడదతో టైఫాయిడ్, మలేరియా జ్వరాల బారిన పడుతున్నారు. వ్యాధులతో ఆ ప్రాంతవాసులు ఇబ్బందులు పడుతున్నారు. పన్నులైతే వసూలు చేస్తున్నారు కానీ తమకు కనీస సౌకర్యాలు కల్పించడంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహదారులు, డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చడంతో పాటు ఖాళీ స్థలాలు శుభ్రపర్చేలా చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.


ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చిమొక్కలు


పారని మురుగు కాల్వలు

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

గుంటూరు విద్యుత్తు, న్యూస్‌టుడే: టౌన్-2 సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్తు లైన్ల మరమ్మతులు చేస్తున్నందున ఈనెల 18న విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ గురవయ్య తెలిపారు. దీని వల్ల శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బ్రాడీపేటలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

ప్రజలకు పోషకాహారం అందుబాటులోకి తేవాలి

అరండల్‌పేట, న్యూస్‌టుడే: ఆరోగ్యకరమైన జీవనాన్ని గడిపేందుకు అవసరమైన పోషకాహారాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన బాధ్యత నేటి పాలకులపై ఉందని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. ప్రపంచ ఆహార దినోత్సవాన్ని అరండల్‌పేట కుబేర టవర్స్‌లోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న హెల్త్ అవేర్‌నెస్ అధ్యక్షుడు అచ్యుత ఇందుశేఖర్ మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి పిలుపు మేరకు ఏటా అక్టోబర్ 17న ప్రపంచ ఆహార దినోత్సవం నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పోషకాహార ప్రచారకుడు టి.నాగిరెడ్డి, విద్యావేత్త రవిబాబు, అవగాహన సంస్థ సభ్యుడు వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు


బహుమతులు అందుకున్న విజేతలతో కేవీఏ శర్మ తదితరులు

గుంటూరుక్రీడలు, న్యూస్‌టుడే: లీలావతి మెమోరియల్ రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు గురువారంతో ముగిశాయి. అండర్-15 కేటగిరీలో బాలబాలికలకు పోటీలు నిర్వహించారు. బాలుర విభాగంలో గంగాధర్, భవన్, రుత్విక్, సీతారామ్, బాలికల విభాగంలో త్రిపురాంబిక, దివ్య, హిమ తేజస్విని, రిషిత విజేతలుగా నిలిచారు. విజేతలకు ఏపీ చెస్ అసోసియేషన్ వైస్ ఛైర్మన్ కేవీఏ శర్మ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పకీరకుమార్, సంయుక్త కార్యదర్శి రాజేష్ బహుమతులు అందజేశారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని టోర్నమెంట్ డైరెక్టర్ చక్రవర్తి తెలిపారు.

50,582 మిర్చి బస్తాల విక్రయం

మిర్చియార్డు : గుంటూరు మిర్చియార్డుకు రైతులు గురువారం 51,885 బస్తాలు తరలించారు. అందులో 50,582 బస్తాల విక్రయాలు జరిగాయి. అమ్మకాలు ముగిసే సమయానికి 26,786 బస్తాలు నిల్వ ఉన్నాయి. నాన్ ఏసీ కామన్ వెరైటీ మిర్చి రకాలు సగటు ధర రూ.8,500-16,500, నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ మిర్చి రకాలు సగటు ధర రూ.8,000-18,500, తాలు మిర్చికి రూ.5,000-11,500 ధర లభించింది. ఏసీ కామన్ వెరైటీ మిర్చి రకాలు సగటు ధర రూ.8,500-17,500, ఏసీ స్పెషల్ వెరైటీ మిర్చి రకాలు సగటు ధర రూ.8,500-15,000, తాలు మిర్చికి రూ.8,500-18,400, తాలు మిర్చికి రూ.5,000-10,500 ధర లభించింది.

కార్యాలయం ప్రారంభం

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: ఆధునికీకరించిన సూపరింటెండెంట్ కార్యాలయాన్ని కిరణ్‌కుమార్ గురువారం ప్రారంభించారు. సమావేశాల నిర్వహణతో పాటు, వీడియో కాన్ఫరెన్స్ సదుపాయాన్ని కల్పించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

97042 53525, 80085 74897

స్పందనకు వందనం

కాల్వలో పూడికతీత: దేవాపురం ప్రధాన రహదారుల్లోని కాల్వలో మురుగు, చెత్త పేరుకుపోయింది. సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంగడి బాబు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కాల్వలో పేరుకుపోయిన మురుగు, చెత్తను తొలగించారు.

చెత్త తొలగింపు: గుండారావుపేటలోని పలు వీధుల్లో కాల్వల్లో చెత్త పేరుకుపోయింది. సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేష్‌నాయక్ దృష్టికి తీసుకెళ్లాం. ఆయన పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి సమస్యను పరిష్కరించారు. **-న్యూస్‌టుడే, నగరంపాలెం**

సభ్యత్వ నమోదు భాజపాకు పండగలాంటిది


మాట్లాడుతున్న భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివన్నారాయణ, వేదికపై నాయకులు

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: సభ్యత్వ నమోదు కార్యక్రమం దేశ వ్యాప్తంగా భాజపాకు పండగలాంటిదని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్రా శివన్నారాయణ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో భాజపా క్రియాశీలక సభ్యత్వ కార్యశాల సీనియర్ నాయకుడు కొత్తూరు వెంకట సుబ్బారావు అధ్యక్షతన గురువారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా విచ్చేసిన శివన్నారాయణ మాట్లాడుతూ కార్యకర్తలందరూ ప్రజాసమస్యలు పరిష్కరిస్తూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా ముందుకు సాగాలని కోరారు. సభ్యత్వ నమోదుకు నాలుగు రోజులే సమయం ఉందని, తర్వాత పది రోజుల్లోపు క్రియాశీలక సభ్యత్వాలు తీసుకోవాలని, వచ్చేనెల 5వ తేదీ లోపు పూర్తి చేసి పుస్తకాలు అందజేయాలని కోరారు. భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి, కోస్తాంధ్ర జోన్ సభ్యత్వ ఇన్‌ఛార్జి వల్లూరు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ దేశంలో అద్భుతమైన పరిపాలన అందిస్తున్న పార్టీ భాజపా అన్నారు. కార్యక్రమంలో సభ్యత్వ నమోదు జిల్లా ఇన్‌ఛార్జి పాలపాటి రవికుమార్, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యడ్లపాటి స్వరూపరాణి, క్రియాశీలక సభ్యత్వ ఇన్‌ఛార్జి జగ్గారపు శ్రీనివాస్, మాజీ మంత్రి శనక్కాయల అరుణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈదర శ్రీనివాస రెడ్డి, నరసరావుపేట, నెల్లూరు జిల్లాల ఇన్‌ఛార్జులు కొక్కెర శ్రీనివాస్, గాజుల వెంకయ్యనాయుడు, పార్లమెంటు సంయోజక్ భీమినేని చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్ వీధి కుక్కలు


కుక్కలను పట్టుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

శ్యామలానగర్ 5వ లైనులో వీధి కుక్కలు ఎక్కువగా ఉంటున్నాయి. పాఠశాలకు పిల్లలు వెళ్తున్న సమయంలోనూ, ద్విచక్ర వాహనంపై రాకపోకలు సాగించే సమయంలోనూ ఎగబడుతూ గాయపరుస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. నగరపాలక సంస్థ అధికారులు స్పందించి వీధి **-న్యూస్‌టుడే, గోరంట్ల**

వైభవంగా వార్షికోత్సవాలు


హరికథా గానం చేస్తున్న సింహాచలశాస్త్రి

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: లక్ష్మీపురం శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం 46వ వార్షికోత్సవాలు, వాగ్గేయకారుల మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. సంఘ కార్యదర్శి వల్లూరి కృష్ణకిశోర్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో ముప్పవరపు సింహాచలశాస్త్రి.. 'ముత్తుస్వామి దీక్షితుల చరిత్ర' అనే అంశంపై హరికథా గానం చేశారు. దీక్షితుల కృతులు, జీవన ఆదర్శాల నేపథ్యంలో కథ సాగింది.

అభివృద్ధి జాడేది

ఆకులవారితోటలో సమస్యల తిష్ఠ

ఏటి అగ్రహారం, న్యూస్‌టుడే

ఆకులవారితోటలో సమస్యలు పేరుకుపోయాయి. ఇక్కడ అభివృద్ధి జాడే లేకుండా పోయింది. సిమెంటు దారులు ఉన్నా మురుగు కాలువల సమస్య వేధిస్తోంది. నగరంలోని 24వ డివిజన్‌లో అంకమ్మనగర్, ఆకులవారితోట, శాంతినగర్, డీఐజీ బంగ్లా ప్రాంతం, శివరామ్‌నగర్, చుట్టుగుంట, కలెక్టర్ బంగ్లా రోడ్డు ప్రాంతాల్లో 5000కు పైగానే గృహాలున్నాయి. సుమారు 20 వేల వరకు జనాభా ఉంటుంది. ఈ డివిజన్‌లో ఆకులవారితోట 2వ లైన్ జెండా చెట్టు దగ్గర సైడ్ కాలువలు చిన్నవిగా ఉండడంతో చిన్నపాటి వర్షానికి కూడా రహదారులు ఏరులై పారుతున్నాయి. శాంతినగర్ 7వలైన్ (బండ్లబజార్) నుంచి ఆకులవారితోటలోకి వెళ్లడానికి మధ్యలో ఉన్న పీకలవాగుపై వంతెన గోడ కూలిపోయింది. ఈ మార్గంలో వంతెన మీదుగా ఏటీ అగ్రహారం మెయిన్ రోడ్డుపై ఉన్న ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తుంటారు. పీకలవాగు ఉద్ధృతంగా ప్రవహించినప్పుడు ఈ రహదారిలో ప్రయాణించడం కష్టమే. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పీకలవాగు పొంగి బండ్లబజార్‌లోని ఇళ్లలోకి నీళ్లు చేరాయి.


ఆకులవారితోటలో గోడ లేక ప్రమాదకరంగా వంతెన


పీకలవాగు దగ్గర రహదారి వెంబడి చెత్త

సాయానికి ఎదురుచూపులు: స్థానికులు, బండ్లబజార్

ఇటీవలే కురిసిన వర్షానికి బండ్లబజార్ ప్రాంతం జలదిగ్బంధమైంది. మా ఇంటిలో మనవరాలి పెళ్లి కోసమని దాచుకున్న బియ్యం నీటిపాలైంది. మాతోపాటు చాలామందికి ఇళ్లలోని వస్తువులు పాడైపోయాయి. ఇంతవరకు ఎవరూ పట్టించుకోలేదు.

దుర్వాసన భరించలేకపోతున్నాం: స్థానికులు, ఆకులవారితోట

ఆకులవారితోట నుంచి బండ్లబజార్‌కు వెళ్లే దారిలో సైడ్ కాలువలు లేక ఇబ్బంది పడుతున్నాం. పీకల వాగు దగ్గర చెత్త తీయకపోవడంతో వాసన వెదజల్లుతోంది. పీకల వాగు పక్కనే గృహాలు ఉండడంతో దోమలు పెరిగిపోయాయి. చీకటి పడగానే తలుపులు, కిటికీలు మూసుకోవాల్సిన వస్తోంది. ఇప్పటికైనా అధికారులు సమస్యను గుర్తించి చర్యలు తీసుకోవాలి.

నాలుగు రోడ్ల కూడలి మూసివేత

గుంటూరు నేరవార్తలు: పట్టాభిపురంలోని నాలుగురోడ్ల కూడలి తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు పశ్చిమ ట్రాఫిక్ సీఐ శింగయ్య తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. పట్టాభిపురం పిల్లల ఆసుపత్రి సమీపంలోని నాలుగురోడ్ల కూడలి వద్ద ఇటీవల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణతోపాటు ట్రాఫిక్ రద్దీని నియంత్రించటానికి నాలుగురోడ్ల కూడలిని తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు చెప్పారు. గుజ్జనగుండ్లవైపు వెళ్లే వాహనచోదకులు మహాత్మాగాంధీ బొమ్మ వద్ద మలుపు తీసుకొని వెళ్లాలన్నారు. పట్టాభిపురం బ్రిడ్జి వైపు వెళ్లేవాళ్లు డీఆర్ఎంవో కార్యాలయం వద్ద మలుపు తీసుకుని ప్రయాణించాలన్నారు.

భాగవతం అమృతఫలం

ఏటీ అగ్రహారం: భాగవతం మానవాళికి అమృతఫలమని డాక్టర్ కోగంటి వెంకట శ్రీరంగనాయకి అన్నారు. ఏటీఅగ్రహారంలోని శ్రీశంకర గాయత్రి దత్త సాయి సత్యదేవ మందిరంలో గురువారం భాగవత సప్తాహం ప్రారంభమైంది.

ఆడిట్ రికార్డులు అప్‌డేట్ చేయాలి


మాట్లాడుతున్న ఆడిట్ శాఖ ఆర్‌డీడీ నాగ శ్రీనివాస్

జిల్లాపరిషత్తు (గుంటూరు), న్యూస్‌టుడే: స్థానిక సంస్థల్లో నిర్వహించిన ఆడిట్‌కు సంబంధించి రికార్డులను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని ఆడిట్ శాఖ మూడో జోన్ ప్రాంతీయ ఉప సంచాలకుడు నాగ శ్రీనివాస్ అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా గుంటూరులోని ఆ శాఖ జిల్లా ఆడిట్ అధికారి కార్యాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం ఆడిటర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ అధికారి ధనలక్ష్మి, ఆడిటర్లు పాల్గొన్నారు.

క్యాన్సర్ రోగులకు ఉపశమన కేంద్రం


కొలాస్టమీ, పెయిన్ మేనేజ్‌మెంట్ క్లినిక్ ప్రారంభిస్తున్న నాగకిశోర్

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: క్యాన్సర్ బాధితులకు ప్రయోజనం కలిగేవిధంగా గుంటూరు ఒమేగా క్యాన్సర్ ఆసుపత్రిలో కొలాస్టమీ, పెయిన్ మేనేజ్‌మెంట్ సెంటర్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు చీఫ్ సర్జికల్ అంకాలజిస్ట్ నాగకిశోర్ తెలిపారు. గుంటూరు మెహర్‌నగర్‌లోని ఆసుపత్రిలో ఈ క్లినిక్‌ను ఏర్పాటు చేసినందున పేగు క్యాన్సర్ వ్యాధిగ్రస్థులకు మెరుగైన చికిత్స అందుతుందని నాగకిశోర్ వివరించారు. ఈ క్లినిక్‌లో కొలాస్టమీ కేర్ నిపుణులు అందుబాటులో ఉన్నందున బాధితులకు సత్వరమే చికిత్స అందడమే గాకుండా, అవసరమైన కౌన్సెలింగ్ ఇస్తారన్నారు. బాధల్ని ఉపశమింపజేసే మందుల్ని ఇవ్వడం కోసం పెయిన్ మేనేజ్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. పూర్తి సమాచారం కోసం 0863-2223300, 91211 06728, 93905 13232 నంబర్లకు ఫోన్ చేయాల్సిందిగా కోరారు.

'సజ్జలను తక్షణమే అరెస్టు చేయాలి'

పట్టాభిపురం, న్యూస్‌టుడే: 'గత ప్రభుత్వంలో సలహాదారుగా వ్యవహరించిన సజ్జల రామకృష్ణారెడ్డి కనుసన్నల్లోనే అన్నీ జరిగాయి. తెదేపా జాతీయ కార్యాలయం, చంద్రబాబు ఇంటిపై దాడి కేసుల్లో ప్రధాన కుట్రదారుడిగా ఉన్న ఆయన్ని తక్షణమే పోలీసులు అరెస్టు చేయాలి'.. అని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మ డిమాండ్ చేశారు. గుంటూరులో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'పోలీసుల విచారణకు సజ్జల సహకరించడంలేదు. వైకాపా నేతలందరూ పోలీసులు అడిగిన ప్రశ్నలకు మాకు తెలియదు. గుర్తు లేదు.. అని తప్పించుకోవాలని చూస్తున్నారు. సెల్‌ఫోన్లు ఇవ్వమని పోలీసులు అడిగితే సహకరించడంలేదు. ఓ వైపు సజ్జలకు, మరోవైపు రౌడీషీటర్ అనిల్‌కుమార్‌కు పోలీసులు రాచమర్యాదలు చేయడం ఎంతవరకు సమంజసం. పోలీసులు తీరు మార్చుకోకపోతే తెదేపా శ్రేణులు స్టేషన్ల ముందు ధర్నాలు చేసే వరకు పరిస్థితి వస్తుంది'.. అని ఆయన హెచ్చరించారు.

రోడ్డుప్రమాదంలో మెడికల్ రిప్రజెంటేటివ్ మృతి

గుంటూరు నేరవార్తలు: రోడ్డు ప్రమాదంలో మెడికల్ రిప్రజెంటేటివ్ మృతిచెందిన ఘటనపై గురువారం పశ్చిమ ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేలంగిణినగర్‌కు చెందిన రవికుమార్ (50) మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నారు. గురువారం మధ్యాహ్నం విధులు ముగించుకొని ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తుండగా అమరావతిరోడ్డు రామాబిల్డింగ్స్ సమీపంలో వెనుక నుంచి వచ్చిన నగరపాలకసంస్థ చెత్త తరలించే ట్రాక్టర్ అతని వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో రవికుమార్ అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న సీఐ శింగయ్య ఘటనాస్థలికి వెళ్లి దర్యాప్తు చేపట్టారు.

బీరు సీసాతో దాడి

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఇద్దరిపై బీరు సీసాతో దాడి చేసిన ఘటనపై గురువారం నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వారి వివరాల ప్రకారం.. శ్రీనివాసరావుపేటకు చెందిన కోటేశ్వరరావు ఇళ్ల నిర్మాణాలకు సెంట్రింగ్ చెక్కల పని చేస్తుంటాడు. ఈ నెల 16న ఆటోలో సెంట్రింగ్ చెక్కలు వేసుకొని ఇంటి నిర్మాణపనులు జరుగుతున్న కృష్ణబాబుకాలనీకి వెళ్లాడు. అక్కడ చెక్కలను దించేసి తిరిగి లాల్‌పురంరోడ్డులోని బార్ వద్ద ఆగి మద్యం తాగడానికి లోపలికి వెళ్లాడు. అప్పటికే అక్కడ మద్యం తాగి ఉన్న ప్రవీణ్ మరో నలుగురు కలిసి కోటేశ్వరరావుతో గొడవ పెట్టుకున్నారు. వినాయకచవితి సమయంలో మండపానికి సెంట్రీ చెక్కలు ఇవ్వలేదంటూ బీరు సీసాతో దాడిచేశారు. అడ్డువెళ్లిన ఆటో డ్రైవర్ వినోద్‌పై కూడా బీరు సీసాతో దాడిచేశారు. ఇద్దరికి తీవ్రగాయాలవడంతో స్థానికులు ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఐదుగురుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వీరానాయక్ తెలిపారు.

ఘనంగా వాల్మీకి జయంతి


వాల్మీకి జయంతి వేడుకల్లో ఆంగ్రూ రిజిస్ట్రార్ రామచంద్రరావు, ఉద్యోగులు


జిల్లా పరిషత్తు కార్యాలయంలో.. ఛైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా

జిల్లాపరిషత్తు(గుంటూరు), కలెక్టరేట్, నవభారత్‌నగర్, న్యూస్‌టుడే: మహర్షి వాల్మీకి జయంతిని ప్రభుత్వ కార్యాలయాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని స్వశక్తి భవనాల సముదాయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టరు టి.వి.విజయలక్ష్మి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి మాట్లాడారు. ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ పరిపాలన భవన్ లాంలో.. వర్సిటీ రిజిస్ట్రార్ జి.రామచంద్రరావు, విభాగాల అధిపతులు, జిల్లాపరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో.. జడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, సీఈవో జ్యోతిబసు, ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి వెంకటేశ్వరరావు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జేకేసీ కళాశాల ప్రాచ్యభాష విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. కలెక్టరేట్‌లోని వీసీ హాలులో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి సభ నిర్వహించారు. కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్సీ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్‌లోని వీసీ హాలులో ఎమ్మెల్సీ లక్ష్మణరావు


జేకేసీ కళాశాలలో విద్యార్థికి బహుమతి అందజేస్తూ..

ప్రిపరేషన్ టెక్నిక్

పుస్తకంలో లేదా నోట్ బుక్‌లో చదివేటప్పుడు ముఖ్యమైన అంశాలను ఇబ్బందిలేని కలర్స్‌తో మార్క్ చేయడం లేదా అండర్‌లైన్ చేయడం ద్వారా హైలైట్ చేసుకోవాలి. దీని వల్ల ప్రధానమైన విషయాలను తేలిగ్గా గుర్తుంచుకోవచ్చు. వేగంగా రివిజన్ చేసుకోవచ్చు.

కరెంట్ అఫైర్స్



■ ఇటీవల భారత నౌకాదళంలో చేరిన అణుశక్తితో నడిచే రెండో బాలిస్టిక్ క్షిపణి జలాంతర్గామి (ఎస్ఎస్‌బీఎన్) ఏది? (రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ జలాంతర్గామిని విశాఖపట్నంలో ప్రారంభించారు. అణుశక్తితో నడిచే భారత తొలి బాలిస్టిక్ క్షిపణి జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిహంత్)

జ: ఐఎన్ఎస్ అరిఘాత్

మాదిరి ప్రశ్నలు

■ జాతీయ పారిశ్రామిక కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎన్ఐసీడీపీ) కింద ఎన్ని కొత్త పారిశ్రామిక స్మార్ట్ సిటీస్ ఏర్పాటుకు ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఇటీవల ఆమోదం తెలిపింది. (ఈ ప్రాజెక్టుల అంచనా పెట్టుబడి మొత్తం రూ. 28,602 కోట్లు. వీటిని 10 రాష్ట్రాల్లో ఏర్పాటు చేయనున్నారు.) జ: 12

■ పౌరసత్వ (సవరణ) చట్టం (సీఏఏ) కింద భారత పౌరసత్వాన్ని పొందిన మొదటి గోవా వ్యక్తిగా ఇటీవల ఎవరు వార్తల్లో నిలిచారు?

జ: జోసెఫ్ ఫ్రాన్సిస్ పెరైరా

■ ఇరాన్ మొదటి మహిళా ప్రభుత్వ ప్రతినిధిగా ఇటీవల ఎవరు నియమితులయ్యారు? (ప్రముఖ విద్యావేత్త అయిన ఈమె గతంలో 'టెక్నికల్ అండ్ ఒకేషనల్ ట్రైనింగ్ యూనివర్సిటీ ఆఫ్ షరియా'కి నాయకత్వం వహించారు.)

జ: ఫతేమెహ్ మొహజెరానీ

మరింత సమాచారం

జనరల్ స్టడీస్ | భౌతిక శాస్త్రం

తేలినా.. మునిగినా.. ఉంటుందో సూత్రం!



అంతపెద్ద ఓడ నీళ్లపై ఎలా తేలుతుంది? గాలితో నిండి ఇంత లావుగా మారిన బెలూన్ కూడా ఎగురుకుంటూ ఏవిధంగా వెళ్లిపోతుంది? ఒకే పరిమాణం ఉన్న చెక్క నీటిపై తేలితే, ఇనుము మునిగిపోతుంది ఎందుకని? ఎప్పుడైనా ఆలోచించారా? వీటన్నింటిలో కొన్ని భౌతికశాస్త్ర సూత్రాలు పనిచేస్తుంటాయి. పదార్థాల స్వభావాన్ని, స్థితిని వాటి సాంద్రత ప్రభావితం చేస్తుంది. తేలడం, మునగడం, ఎగరడాలను అదే నిర్ణయిస్తుంది. భౌతిక శాస్త్రంలో ప్రాథమికాంశాలైన ఈ నియమాలను అభ్యర్థులు తెలుసుకోవాలి. వాటి ఆధారంగా పనిచేసే పరికరాలు, ఉపయోగాలతోపాటు ఆర్కిమెడిస్, పాస్కల్, బెర్నౌలీ సూత్రాలు, సమీకరణాలను అర్థం చేసుకోవాలి. సంబంధిత అనువర్తనాలపై అవగాహన కలిగి ఉండాలి.



తేలియాడే వస్తువులు

కొన్ని రకాల వస్తువులు నీటిలో మునుగుతాయి, మరికొన్ని తేలుతాయి. అలాగే గాజు గోలీలు నీటిలో మునుగుతాయని, చెక్కముక్క నీటిలో తేలుతుందని అందరికీ తెలుసు.

1) రెండు కిలోగ్రాముల చెక్క ముక్క ఒక కిలోగ్రాము ఇనుము కంటే బరువైంది.

2) ఇనుము, చెక్క కంటే బరువైంది.

ఈ వాక్యాల్లో బరువు అనే పదం ఏ అర్థంలో వాడారో తెలుసుకోవాలి. విజ్ఞాన శాస్త్రంలో ఏ పదాన్ని అయినా అందరికీ ఒకే రకంగా అర్థమయ్యే విధంగా ఉపయోగిస్తారు. మొదటి వాక్యం ప్రకారం త్రాసులో ఒక పళ్లెంలో రెండు కిలోగ్రాముల చెక్కను, మరో పళ్లెంలో ఒక కిలోగ్రాము ఇనుమును ఉంచితే త్రాసు దండం చెక్కను ఉంచిన పళ్లెం వైపు వంగుతుంది.

◆ రెండో వాక్యం ప్రకారం.. ఇనుము, చెక్క కంటే బరువైనదంటే.. ఒకే పరిమాణం ఉన్న ఇనుము, చెక్క ముక్కలను త్రాసు పళ్లాల్లో చెరొక దాన్ని ఉంచితే త్రాసు దండం ఇనుప ముక్కను ఉంచిన పళ్లెం వైపు వంగుతుంది. విజ్ఞానశాస్త్ర పరిభాషలో చెక్క కంటే ఇనుము సాంద్రత ఎక్కువ. బరువు, తేలిక అనేవి సాంద్రత ఆధారంగా నిర్ణయమవుతాయి.

సాంద్రత: ప్రమాణ ఘనపరిమాణం ఉన్న పదార్థ ద్రవ్యరాశిని సాంద్రత అంటారు.

$$\therefore \text{సాంద్రత} = \frac{\text{ద్రవ్యరాశి}}{\text{ఘనపరిమాణం}}$$

● నీటి సాంద్రత = 1 gm/cm^3

S.I. యూనిట్ ⟶ kg/m^3

CGS యూనిట్ ⟶ gm/cm^3

◆ ఎక్కువ సాంద్రత ఉండే పదార్థాలు బరువైనవని, తక్కువ సాంద్రత ఉండే పదార్థాలు తేలికైనవని చెప్పవచ్చు.

సాపేక్ష సాంద్రత/తారతమ్య సాంద్రత: ఒక వస్తువు సాంద్రతను నీటి సాంద్రతతో పోల్చడాన్ని సాపేక్ష సాంద్రత అంటారు.



బారోమీటర్

$$\text{◆ వస్తువు సాపేక్ష సాంద్రత} = \frac{\text{వస్తువు సాంద్రత}}{\text{నీటి సాంద్రత}}$$

$$\text{◆ ద్రవం సాపేక్ష సాంద్రత} = \frac{\text{ద్రవం ద్రవ్యరాశి}}{\text{అంతే ఘనపరిమాణం ఉండే నీటి ద్రవ్యరాశి}}$$

◆ పాదరసం సాపేక్ష సాంద్రత = 13.6 (సాపేక్ష సాంద్రతకు ప్రమాణాలు లేవు)

1) ఒకే ద్రవ్యరాశి ఉండే పాలు, నీరు కలిపినప్పుడు

$$\text{ఆ మిశ్రమం ఫలిత సాంద్రత} = \frac{2P_1P_2}{P_1+P_2}$$

2) ఒకే ఘనపరిమాణం ఉండే పాలు, నీరు కలిపినప్పుడు ఆ మిశ్రమం ఫలిత సాంద్రత $= \frac{P_1+P_2}{2}$

వాతావరణ పీడనం(P_o) : భూమిపై ఉన్న అన్ని వస్తువులపై గాలి కలిగించే పీడనాన్ని వాతావరణ పీడనం అంటారు.

$\therefore P_o = pgh$

p = వాతావరణ సాంద్రత

g = గురుత్వ త్వరణం

h = వాతావరణం ఎత్తు

◆ వాతావరణ పీడనాన్ని కొలవడానికి బారోమీటర్ ఉపయోగిస్తారు.

భారమితి (బారోమీటర్): దీన్ని టారిసెల్లి అనే శాస్త్రవేత్త కనుక్కున్నాడు. ఇందులో పాదరసాన్ని ఉపయోగిస్తారు.

◆ సముద్ర మట్టం వద్ద సాధారణ వాతావరణ పీడనం P_o = 76 cm

◆ సముద్ర మట్టం వద్ద వాతావరణ పీడనం ఒక అట్మాస్ఫియర్ పీడనానికి సమానం.

$\therefore$ 1 Atma = 1.01×10^5 పాస్కల్

◆ భారమితిలో పాదరస స్తంభం ఎత్తు హఠాత్తుగా తగ్గడం తుపాను రాకను సూచిస్తుంది.

◆ భారమితిలో పాదరస స్తంభం ఎత్తు నెమ్మదిగా తగ్గడం వర్షం రాకను సూచిస్తుంది.

◆ సముద్ర మట్టం నుంచి ఎత్తుకు వెళ్లేకొద్దీ వాతావరణ పీడనం తగ్గుతుంది. లోతుకు వెళ్లేకొద్దీ పెరుగుతుంది.

నీరు - పీడనం: నీరు మూడు రకాల పీడనాలను కలిగిస్తుంది.

1) ఊర్ధ్వ పీడనం: నీరు వస్తువులపై ఊర్ధ్వ దిశలో కలిగించే పీడనాన్ని ఊర్ధ్వ పీడనం అంటారు.

2) అధో పీడనం: నీరు పాత్ర అడుగు భాగంలో కలిగించే పీడనాన్ని అధోపీడనం అంటారు.

3) పార్శ్వ పీడనం: నీరు పాత్ర పక్కతలాలపై కలిగించే పీడనాన్ని పార్శ్వపీడనం అంటారు.

ఉత్ప్లవన బలం: ద్రవంలో ఉన్న వస్తువులపై ఊర్ధ్వ దిశలో కలగజేసే బలాన్ని ఉత్ప్లవన బలం అంటారు.

◆ ద్రవాల సాంద్రతను కొలిచే పరికరం - హైడ్రోమీటర్

◆ పాల స్వచ్ఛతను కొలిచే పరికరం - లాక్టోమీటర్

ఆర్కిమెడిస్ సూత్రం: ద్రవంలో ఒక వస్తువును పూర్తిగా లేదా పాక్షికంగా ముంచినప్పుడు అది ఆ ద్రవంలో కోల్పోయినట్లు అనిపించే బరువు, ఆ వస్తువు తొలగించిన ప్రవాహి లేదా ద్రవం బరువుకు సమానం.

అనువర్తనాలు: 1) ఆభరణాల స్వచ్ఛతను కనుక్కోవడానికి ఉపయోగపడుతుంది. 2) జలాంతర్గాములు ఈ సూత్రం మీదే పనిచేస్తాయి.

పాస్కల్ నియమం: ప్రత్యేకమైన ఆకారం ఉండే పాత్రలో ద్రవం నింపి ఒకవైపు తక్కువ పీడనాన్ని కలిగిస్తే అది ఆ ద్రవంలో అన్ని వైపుల్లో సమానంగా పీడనాన్ని కలిగించి రెండో వైపు అధిక పీడనాన్ని ఉత్పత్తి చేస్తుంది. దీన్నే పాస్కల్ నియమం అంటారు.

అనువర్తనాలు: 1) హైడ్రాలిక్ బ్రేకులు 2) హైడ్రాలిక్ జాకీలు 3) పత్తి నుంచి పత్తి బేళ్ల తయారీ 4) బ్రామాప్రెస్ పనిచేయడానికి ఈ నియమం ఉపయోగపడుతుంది.


బెర్నౌలీ సూత్రం: భూమికి క్షితిజ సమాంతరంగా, వేగంగా గాలి వీచినప్పుడు వస్తువు పైభాగంలో కంటే అడుగు భాగంలో అధిక పీడనం ఏర్పడి వస్తువులు పై దిశగా కదులుతాయి. దీన్నే బెర్నౌలీ సూత్రం అంటారు.

అనువర్తనాలు: ● విమానం గాల్లోకి ఎగరడం. ● ఫ్యాన్ గాలికి గోడకు తగిలించిన క్యాలెండర్ అడుగుభాగాన కాగితాలు పైకి కదలడం. ● తుపాను గాలికి తాటాకులు, గుడిసె పైకప్పులు ఎగిరిపోవడం. ● గాలిపటం భూమి నుంచి కొంత ఎత్తులో ఎగరడం.



రచయిత: చంటి రాజుపాలెం

SENIOR INTER Botany



Special proteins in cell membrane

Q&A

Transport in plants (2 Marks)

1) Define water potential? What is the value of water potential of pure water.

A: The relative difference between the chemical potential of pure water to that of solution. Water potential of the solution increases with increase of water molecules. Water potential of pure water is maximum i.e., zero (0).

2) What are Porins? What role do they play in diffusion?

A: Special proteins present in cell membrane are called porins. Present in the membranes of mitochondria, plastids and bacteria and allow the hydrophilic (water loving) molecules of their size.

Photosynthesis In Higher Plants (2 Marks)

1) Define the Law of Limiting factors proposed by Blackman.

A: When photosynthesis is influenced by several factors, the rate of the process is limited by slowest factor and this factor is called limited factor. CO_2 is limiting factor for photosynthesis.

2) Where does the photolysis of H_2O occur? What is its significance?

A: Thylakoid lumen of the chloroplast. The oxygen (O_2) evolved in photolysis is life gas for all organisms during respiration.

Some More Imp Questions 2 Marks For Answers

Transport in plants

1) What are apoplast and symplast?
2) Differentiate Osmosis and Diffusion.
3) How does guttation differ from transpiration?

Photosynthesis In Higher Plants

1) What is the primary acceptor of CO_2 in C_3 plants? What is first stable compound formed in a Calvin cycle?
2) How many molecules of ATP and NADPH are needed to fix a molecule of CO_2 in C_3 plants? Where does this process occur?

-Dr. M. Chenna Kesavulu

రాజధానిలో జాతీయ క్రీడలు నిర్వహిస్తాం

సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం



ఏపీ క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే నరేంద్రకుమార్, శాప్ ఛైర్మన్ రవినాయుడు



హర్డిల్స్‌లో యువతులు



లాంగ్‌జంప్

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: రాజధాని ప్రాంతంలో జాతీయ క్రీడలు నిర్వహిస్తామని విజయవాడ ఎంపీ, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని చిన్ని చెప్పారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో గురువారం 35 సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీలను ఎంపీ కేశినేని, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు ప్రారంభించారు. క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయిన తర్వాత ఎలాంటి క్రీడా సౌకర్యాలు లేవన్నారు. 2027లో జాతీయ క్రీడల నిర్వహించేందుకు అమరావతిలో స్పోర్ట్స్ సిటీని నిర్మిస్తున్నామని తెలిపారు. క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రైవేటు విశ్వవిద్యాలయాలు ముందుకు రావాలని కోరారు. శాప్ ఛైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ క్రీడాంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని చెప్పారు. నియోజకవర్గాల్లో అసంపూర్తిగా ఉన్న క్రీడా మైదానాలను వెంటనే పూర్తిచేస్తామన్నారు. విద్యాశాఖ మంత్రి లోకేశ్ అన్ని పాఠశాలలో క్రీడా మైదానాలు ఏర్పాటుచేయాలని జీవో విడుదల చేయడం శుభసూచకమన్నారు. ఇన్‌ఛార్జి వీసీ గంగాధర్, రెక్టార్ ఆచార్య రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, ఏపీ అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడు గౌతమ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు విజేతలు వీరే

అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలోం తొలిరోజు ఆంధ్ర క్రీడాకారులు సత్తా చాటారు. అండర్-20 పురుషుల విభాగంలో ఏపీ క్రీడాకారుడు షేక్ రోషన్ బంగారు పతకాన్ని సాధించారు. ఇదే విభాగంలో 1,500 మీటర్ల పరుగుపందెంలో తెలంగాణ క్రీడాకారుడు కత్రావత్ శ్రీను ప్రథమ, ఏపీ క్రీడాకారుడు కురుబ మహేంద్ర ద్వితీయ, 5వేల మీటర్ల పరుగుపందెంలో హరీష్ మల్లు తృతీయ స్థానాల్లో నిలిచారు. అండర్- 16 బాలుర విభాగంలో నిర్వహించిన 4 కిలోల షాట్‌పుట్ పోటీలలో ప్రణీత్‌కుమార్ మొదటి, ఇదే విభాగంలో నిర్వహించిన లాంగ్‌జంప్‌లో యశ్వంత్‌రాజ్ మూడో, అండర్- 16 బాలికల విభాగంలో 60 మీటర్ల పరుగు పందెంలో డింపుల్ మహా శ్రీ మొదటి స్థానాలను సాధించారు.

వైద్య విద్యార్థులకు ప్రయోజనం

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: గుంటూరు వైద్య కళాశాలలో(జీఎంసీ)లో నైపుణ్యాల ప్రయోగశాల(స్కిల్ ల్యాబ్) ఏర్పాటు చేసినందున బోధనానిపుణులతో పాటు విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని వెల్లూరు క్రిస్టియన్ వైద్య కళాశాల ఆచార్యులు ఈజేసీ జేమ్స్ తెలిపారు. వైద్య కళాశాలల్లో పని చేస్తున్న బోధనా నిపుణులకు గురువారం జీఎంసీలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో జేమ్స్ మాట్లాడారు. శిక్షణలో భాగంగా వైద్య విద్యార్థులతో నేరుగా రోగులపై ప్రయోగాలు చేయడానికి ప్రస్తుతం ఎవరూ అంగీకరించే పరిస్థితులు లేవన్నారు. అందువల్లే స్కిల్ ల్యాబ్‌లో కృత్రిమ రోగి(ఆర్టిఫిషియల్ పేషెంట్) వలే ఉన్న రబ్బరు బొమ్మల సాయంతో మెలకువలు నేర్చుకోవాల్సిందేనన్నారు. అది మామూలు రోగిలా ఉన్నందున.. దాని ద్వారా రక్తపోటు, నాడి, హృదయం తదితర ఎన్నో రకాల అవయవాల పనితీరు తెలుసుకోవాలన్నారు. ఈసీజీ కూడా ఈ కృత్రిమ రోగికి తీసి పరిశీలించవచ్చన్నారు. పసిబిడ్డలకు చికిత్స ఏవిధంగా అందించాలో, రోగికి వార్డులో సెలైన్ ఎలా ఎక్కించాలో, సూది మందు ఏవిధంగా ఇవ్వాలో తెలుసుకోవచ్చన్నారు. రబ్బరు బొమ్మలపై భయం లేకుండా ఎన్ని సార్లైనా ప్రయోగాలు చేయొచ్చన్నారు. తప్పులుంటే వెంటనే తెలుసుకోవచ్చన్నారు. ఈ శిక్షణకు మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు ప్రభుత్వాసుపత్రుల నుంచి ఐదుగురు చొప్పున బోధనానిపుణులు హాజరయ్యారు.

సమకాలీన సమస్యలు ఎత్తి చూపిన నాటికలు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ సృజనాత్మకత, సంస్కృతి సమితి, అభినయ ట్రస్ట్, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్, యశోదా ఫౌండేషన్‌ల సంయుక్త నిర్వహణలో జరుగుతున్న నారా చంద్రబాబు నాటకోత్సవాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. రెండో రోజైన గురువారం ప్రదర్శించిన నాటికలు సామాజిక సమకాలీన అంశాల ఇతివృత్తాలతో సాగాయి. గుంటూరు శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో రెండో రోజు ప్రదర్శనల్లో 'నేనేం చేసుకుంటాను' నాటికను పూర్ణోదయ ఆర్ట్స్ చీరాల కళాకారులు ప్రదర్శించారు. కృష్ణమూర్తి వంజారి రచనకు.. పూర్ణ సత్యం దర్శకత్వం వహించారు. గ్రహదోషాల నివారణ పేరుతో ప్రస్తుత సమాజంలో కొందరు చేసే మోసాలను ఎండగట్టిందీ నాటిక. కష్టాల్లో ఉన్న ఓ వ్యక్తి ఆలయానికి వచ్చి తన కుమారుడికి గ్రహదోష నివారణకు పూజలు జరిపించమని కోరగా.. రూ.1.10 లక్షలు ఖర్చవుతుందని పూజారి చెప్పడంతో అప్పు కోసం ప్రయత్నిస్తుంటాడు. కానిస్టేబుల్ గమనించి పూజారిని నిలదీసి కష్టాల్లో ఉన్న వ్యక్తి స్థోమత ప్రకారం పూజలు చేయాలే గాని ఆర్థికంగా కష్టాల్లోకి నెట్టకూడదు కదా అని హితబోధ చేస్తాడు. దీంతో పూజారి సక్రమ మార్గంలోకి రావడాన్ని నాటికలోని నటీనటులు చక్కగా అభినయించారు.



నేనేం చేసుకుంటాను నాటికలో సన్నివేశం

మరో నాటిక 'ఎడారిలో వానచినుకు'.. కాకినాడ శ్రీసాయికార్తీక్ క్రియేషన్స్ వారు శారదా ప్రసన్న రచనకు సీహెచ్.మహేష్ దర్శకత్వం వహించారు. కొందరు పిల్లలు వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల విషయంలో చూపుతున్న నిరాదరణను ఎత్తి చూపింది. సురేష్ తన తల్లిదండ్రులు శారదమ్మ, సుందరయ్యలను వృద్ధాశ్రమంలో వదిలేశాడు. అమెరికా నుంచి వచ్చిన మనోజ్ మంచి మనసుతో వారిని తన దత్తత తీసుకోవాలనుకుంటే, సురేష్ వారిని రూ.25 లక్షలకు బేరం పెడతాడు. విషయం తెలిసి ఆగ్రహించిన తల్లిదండ్రులు తీసుకున్న నిర్ణయమే ఎడారిలో వానచినుకు నాటిక సారాంశం.

భూ సర్వేపై సమగ్ర సమీక్ష

దుగ్గిరాల, న్యూస్‌టుడే : గ్రామాల్లో జరిగిన సమగ్ర భూ సర్వేపై కేంద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖలో భూ వనరుల విభాగం(డీవోఎల్ఆర్) కార్యదర్శి మనోజ్ జోషి గురువారం మండలంలోని చింతలపూడిలో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవతేజ తదితరులు తొలుత ఆయనకు సర్వే జరిగిన విధానాన్ని వివరించారు. మొదటి దశలోనే సర్వే పూర్తైన చింతలపూడి భూ రికార్డులను ఆయనకు చూపారు. ఒకవేళ సర్వేలో తప్పులు, కొలతల్లో సమస్యలు వస్తే ఎలా సరిదిద్దారు? అని ఆయన ప్రశ్నించారు. రైతుల్ని కూర్చోబెట్టి మాట్లాడామని, తద్వారా సమస్యలు పరిష్కరించగలిగామని కలెక్టర్ వివరించారు. భూ సర్వేకు సంబంధించిన ఫొటో ప్రదర్శనలు చూశారు. అనంతరం సర్పంచి తాడిబోయిన రామకృష్ణతో కలిసి రైతులతో మాట్లాడారు. సర్వే వల్ల గతంలో తమ తాత, ముత్తాతల పేరిట ఉన్న భూములకు తమ పేరిట పాస్ పుస్తకాలు వచ్చాయని, సర్వే బాగానే ఉందని అన్నదాతలు చెప్పారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంలో డీఐఎల్ఆర్ఎంటీ ప్రాజెక్టులో భాగంగా రీసర్వే చేశామన్నారు. ఇప్పటి వరకూ జిల్లాలో 62 గ్రామాల్లో సర్వే పూర్తైనట్లు చెప్పారు. రాష్ట్ర సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ శ్రీకేష్ లత్కర్, డిప్యూటీ డైరెక్టర్లు గోవిందరావు, కెజియా కుమారి, సీజీవీఎన్ కుమార్, సీఈవో జ్యోతిబసు, సర్వే ఏడీ పవన్‌కుమార్, సబ్ కలెక్టర్ సంజనాసిన్హ, తహసీల్దార్ సునీత తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ నాగలక్ష్మితో మాట్లాడుతున్న డీవోఎల్ఆర్ కార్యదర్శి మనోజ్‌జోషి

నృసింహుని హుండీల ఆదాయం రూ.45.51 లక్షలు

మంగళగిరి, న్యూస్‌టుడే : మంగళగిరి శ్రీపానకాల లక్ష్మీనృసింహ, వెంకటేశ్వర స్వామి దేవాలయాల్లోని కానుకల హుండీలను గురువారం లెక్కించారు. అన్నదానంతో కలిపి మొత్తం రూ. 45,51,136 ఆదాయం లభించినట్లు దేవస్థానం సహాయ కమిషనర్ రామకోటిరెడ్డి తెలిపారు. పానకాల స్వామి ఆలయంలో హుండీల ఆదాయం రూ. 18,90,274 కాగా.. నృసింహుని సన్నిధిలో రూ. 25,30,803, వెంకటేశ్వర స్వామి ఆలయ హుండీలో రూ. 85,800 కానుకలు లభించాయి. అన్నదానానికి రూ. 44,285 భక్తుల నుంచి విరాళాలు వచ్చినట్లు సహాయ కమిషనర్ ప్రకటించారు.

పంట నష్టపరిహారం పంపిణీలో అవకతవకలు

రూ.6.39 లక్షలు అధికారులకు తిరిగి చెల్లింపు

మేడికొండూరు, న్యూస్‌టుడే : పంట నష్టపరిహారం సొమ్ము పంపిణీలో జరిగిన అవకతవకలను నిగ్గు తేల్చేందుకు అధికారులు చేపట్టిన విచారణ గురువారం రెండో రోజూ కొనసాగింది. గుంటూరు ఇన్‌ఛార్జి ఏడీఏ తిరుమలాదేవి ఆధ్వర్యంలో అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి మండలంలోని ఎనిమిది గ్రామాల్లో విచారణ చేస్తున్నారు. ఇందులో ముఖ్యంగా యలవర్తిపాడు రెవెన్యూ పరిధిలో అక్రమాలు జరిగాయని ఆరోపణలు రావడంతో ఆ గ్రామంపై ప్రత్యేక దృష్టి సారించారు. అక్కడ మొత్తం 104 మంది పేర్లు పరిహారం జాబితాలో చేర్చారు. ప్రభుత్వం ఇందుకు గాను రూ.18లక్షలకు పైగా సొమ్ము రైతుల వ్యక్తి గత బ్యాంకు ఖాతాలకు జమ చేసింది. ఈ నేపథ్యంలో అధికారులు యలవర్తిపాడులో ఒక్కో రైతుతో మాట్లాడి వివరాలు తెలుసుకుంటుండగా అక్రమాలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి. వీటికి మాకు ఎలాంటి సంబంధం లేదని కొంతమంది అన్నదాతలు అధికారుల వద్ద వాపోతున్నారు. అక్రమం ఏ విధంగా జరిగిందో తేల్చాలని బాధిత రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో యలవర్తిపాడు రెవెన్యూ పరిధిలో అయిదుగురికి వారికి తెలియకుండానే పంట నష్టపరిహారం సొమ్ము తమ బ్యాంకు ఖాతాలో జమ అయ్యిందని, దీనిపై మాకు ఎలాంటి సంబంధం లేదని ఒప్పుకుంటూ రూ.2.14 లక్షలు అధికారులకు తిరిగి చెల్లించారు. దీనికి ముందు యలవర్తిపాడు ఎంపీఈవో అక్రమాలకు బాధ్యత వహిస్తూ రూ.4.25 లక్షలు తిరిగి అధికారులు చెల్లించారని మేడికొండూరు ఏవో నాగరాజు 'న్యూస్‌టుడే'తో తెలిపారు. శుక్రవారం కూడా విచారణ జరుగుతుందని, ఎంత మేర అక్రమం జరిగిందే పూర్తి స్థాయిలో నిగ్గు తేల్చుతామని అధికారులు విలేకరులతో తెలిపారు.



యలవర్తిపాడులో రైతులను విచారిస్తున్న అధికారులు